కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక



జనవరి 2012

కొత్తపల్లి తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక- జనవరి 2012

http://kottapalli.in/2012/01/welcome

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం 'మేరియా మాంటిస్సోరి': వీరాంజనేయులు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222, 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయసూచిక

పిల్లల ఇల్లు

అనగా అనగా చాలా కాలం క్రితం గ్రీకు దేశంలో ప్లాటో అనే ఒక పెద్ద గురువుగారు ఉండేవారు. చాలామంది రాజులూ, చక్రవర్తులూ సైతం ఆయన జ్ఞానం ముందు తలవంచేవాళ్ళు. ఖగోళ శాస్త్రం, సామాజిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, తత్వశాస్త్రం- ఒకటేమిటి, అన్ని శాస్త్రాల్లోనూ దిట్ట, ఆయన. ఆయనమాట అంటే అక్కడి రాజుగారికి వేదవాక్కులాగా ఉండేది.

బాగాతిని, కూర్చొని దీర్ఘంగా ఆలోచించి చాలా విలువైన నిర్ణయాలు వెలువరిస్తూ ఉండేవాడాయన. భూస్వాములూ, చిన్న చిన్న రాజులూ ఆయన ఆలోచనల్ని అమలు పరచటమే తప్ప, ఎదురు తిరిగి ప్రశ్నించటం అనేదే ఉండేది కాదు.

ఆయనకు ఒకసారి ఒక ఐడియా వచ్చింది: ప్రపంచంలో చాలా అసమానతలు ఉన్నై. కొందరు ధనికులు, కొందరు పేదలు. ధనికులు వాళ్ల పిల్లల్ని చాలా బాగానే పెంచుతున్నారు. వాళ్లకు దేశాభిమానమూ, నైతిక విలువలూఅన్నీనేర్పుతున్నారు. కానీ, పేదవాళ్ళు? వాళ్ల పిల్లలకు దేశప్రేమా ఉండట్లేదు; నీతి నియమాలూ ఉండట్లేదు. వాళ్లంతా రోగిష్టులూ, పోకిరీలూ అయిపోతున్నారు. అందుకని, పిల్లలందర్నీ రాజే పెంచితే బాగుంటుంది- అంటే రాజుగారు ఏరి కోరి ఎంపిక చేసిపెట్టిన మేధావి వర్గమే అందరు పిల్లల్నీ మలచే బాధ్యత స్వీకరిస్తుందన్నమాట. ఈమేధావి వర్గంవాళ్ళు దేశంలో పుట్టిన పిల్లలందర్నీ వాళ్ల తల్లిదండ్రులకు దూరంగా, రాజుగారు అప్పటికే గొప్పగా నిర్మించి పెట్టిన కలల ప్రపంచంలోకి ఎత్తుకెళ్ళిపోతారు. పిల్లల్ని ఒకసారి ఇట్లా కుటుంబాల పరిధిలోంచి తప్పించేశాక, వాళ్లకు మనం ఏవి కావాలనుకుంటే అవి నూరిపోయవచ్చు; వాళ్లందరూ గొప్ప పౌరులయ్యేట్లు శిక్షణనివ్వచ్చు. పేదవాళ్ళు బాగుపడటంకోసం ధనికులు ఈమాత్రంత్యాగంచెయ్యవలసిందే- తమ పిల్లల్నీ రాజుగారి బడికి పంపించాల్సిందే. అక్కడ పిల్లలందర్నీ ఒకేలాగా చూస్తారు కనుక, వాళ్లలో తేడాలుండవు.

అందరూ కలిసి మానవ సమాజం కోసం శ్రమిస్తారు.

అయితే రాజుగారు అట్లాంటి పని మొదలు పెట్టేసరికి ఏమై ఉంటుందో ఊహించుకోవటం సులభం. గందరగోళమైంది! పిల్లలందరూ కలవరపడిపోయారు; ఎదురు తిరిగారు, తల్లిదండ్రులు గొడవ చేశారు; రాజ్యమంతా అల్లకల్లోలం అయ్యింది; అంతా జరిగాక గురువుగారి నోరు మూతపడింది. లోకం మళ్ళీ మామూలుగా తన దారిన తను నడవటం మొదలు పెట్టింది.


పిల్లలు మైనపు బొమ్మలు కారు. వాళ్లని ఇష్టం వచ్చినట్లు మలచిపారెయ్యటం వీలవదు. ప్రతి పిల్లవాడిలోనూ, ప్రతి పాపలోనూ తనదైన ఆత్మ ఒకటి ఉంటుంది. స్వీయమైన ఆ ఆత్మ ఎదిగే క్రమం కూడా ఒకటి ఉంటుంది. చదువు నేర్పించే వాతావరణం ఆ క్రమానికి దగ్గరగా ఉంటే, పిల్లలు అందులో ఇమిడిపోయి, ఆ ధారలో ప్రవహిస్తూ, ఆ ధారకే క్రొత్త రంగులు అద్దుతూ, సంతోషంగా ఎదుగుతారు. అట్లా ఎదిగిన పిల్లల్లో చైతన్యం ఉంటుంది. శాస్త్ర విజ్ఞాన రంగాల్లో గానీ, కృషియాంత్రిక రంగాల్లోగానీ, కళల్లో గానీ- తాము దేన్ని ఎంచుకుంటే ఆ రంగంలోకి ఆ చైతన్యాన్ని జొప్పిస్తారు వాళ్ళు. అలా వాళ్ళు ఎదుగుతూ, ఆయా రంగాల్నీ రాణింపజేస్తారు.



ఈ భావనని ఇలా ఊరికే చెప్పటం కాకుండా, 'ఇది నిజంగా కావాల్సిందే' అని చేసి చూపించింది, మేరియా మాంటిసోరీ. ఇటలీ దేశానికి చెందిన ఈ డాక్టరమ్మ, పిల్లల్ని 'అర్థం చేసుకోవాలి' అని నొక్కి చెప్పిన గొప్ప మనిషి. జనవరి తొమ్మిదిన ఆవిడ మొదలుపెట్టిన 'కాసా ద బాంబిని'- పిల్లల ఇల్లు, ఈ నూరు పై చిలుకు సంవత్సరాల్లో చాలా పెద్దదే అయ్యింది. ఆవిడకు, ఆవిడ కట్టిన ఆ పొదరింటిని మరింత గుబాళింపజేసేందుకు ప్రయత్నిస్తున్న వాళ్లకు అందరికీ నమస్కారాలు.

ఈ 2012 పిల్లలందరికీ సంతోషాన్ని, చైతన్య దీప్తిని అందించాలని ఆకాంక్షిస్తూ,

కొత్తపల్లి బృందం.



నీతి చంద్రిక

విగ్రహం-3

జరిగిన కథ: వెనక్కి తిరిగివచ్చిన కొంగ తన యాత్రా విశేషాలు వివరిస్తున్నది హంస రాజుకు. అక్కడ నెమలి రాజ్యంలోని పక్షులు దానితో పోట్లాట పెట్టుకున్నాయి.. ఇక చదవండి నీతి చంద్రిక 27 వ భాగం...

మూలం: కీ.శే.కందుకూరి వీరేశలింగం సరళీకరణ:ఘడియారం వేంకట నారాయణ శర్మ

పక్షులు తమ తిట్లను కొనసాగించాయి- "ఓరీ! స్వామిద్రోహీ! తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టినట్లు, మా దేశంలో తిరుగుతూ మా రాజులోనే తప్పులు ఎంచుతున్నావే?! అందుకుగాను నిన్ను తక్షణం చంపేయచ్చు. పాపీ! నీపట్ల కొంచెం కూడా దయ చూపించనవసరంలేదు. తిని కూర్చొని, ఉబుసుపోక, నోటి తీట కొద్దీ ఇంతవరకు తెచ్చుకున్నావు. చేసుకున్న పాపాన్ని అనుభవించక తప్పదు.

ఇప్పుడు ఎట్లాగైనా నీ ప్రాణాలు తీయకుండా వదలం, ఒక్క నిముషం తొందరపడ కుండా నిలు- నువ్వెన్ని కష్టాలు ఎదుర్కొంటావో నీకే తెలుస్తుంది" అంటూ ఎగిరి, ఆ పక్షులన్నీ

వల్లమాలిన కోపంతో ఒళ్లు మరచిపోయి, గోళ్లతో రక్కుతూ, ముక్కులతో పొడుస్తూ, రెక్కలతో చరుస్తూ నన్ను నొప్పించాయి.

అటుపైన అవన్నీ అన్నాయి- "మీ రాజ హంస చాలా మెత్తనిది. అట్లాంటి వాడికి రాజ్యాధికారం, పూజనీయత ఎక్కడిది? ఎప్పుడూ క్షమిస్తూ పోయే రాజును చూసి, పనివాళ్లు బెదరటం మానేసి ఎగతాళి చేస్తారు. క్షమాగుణాన్నీ, కోపంతో కూడిన స్థిరత్వాన్ని సందర్భానుసారంగా ప్రయోగించటం రాజధర్మం. అట్లాంటి రాజే ప్రజలకు ఇష్టమౌతాడు.

ఎప్పుడూ కోపగించుకోవటం కూడా మంచిది కాదు. అట్లా కోపగించుకొనే రాజును ప్రజలు అతి క్రూరునిగా భావిస్తారు. వాడి సాంగత్యాన్ని పాముతో చెలిమిలాగా విడిచిపెడతారు.

కాబట్టి రాజన్నవాడు అవసరాన్నిబట్టి క్షమాగుణాన్ని, కాఠిన్యాన్నీ, రెండింటినీ కన బరచాలి. శౌర్యం, శాంతం మొదలైన గుణాలన్నిటితోటీ, తేనెటీగలతో కూడుకున్న తేనెపట్టు మాదిరి; ఒక వైపు కదిలించేందుకు భయంగొల్పేట్టు, మరొకవైపున చేరేందుకు ఇష్టంగొల్పేట్లు ఉండాలి రాజు ఎప్పటికీ. మెత్తగా ఉండేవాడు చేతిలో ఉన్న డబ్బునే దక్కించుకోలేడే, ఇంక ప్రజల్ని పరిపాలించి, రాజ్యభారాన్ని ఎట్లా మోయగల్గుతాడు?

నీళ్లలో పడి ఉండే మెత్తటి తెల్లపిట్టనా, 'రాజు' అన్నపేరుకి అర్హుడు?! ఆ పేరు మోసేవాడు ఎంత గొప్పగా ఉండాలి!! అట్లాంటి బలహీనుడికి పాదసేవకుడివే, నువ్వు?! నువ్వెన్ని భాగ్యాలు అనుభవించావని,ఇప్పుడు గొప్ప మేలుకోరే వాడిలాగా మాకు ఈ పెడబుద్ధులు నేర్పించాలని వచ్చావు?

లోకంలో ఎవరైనా బలం ఉన్నవాడి దగ్గర చేరతారు గానీ, బలహీనుడిని దగ్గరికి కూడా రానివ్వరే! ఎప్పుడైనా ఆశ్రయించాల్సివస్తే పండ్లతో నిండి గొప్పగా నీడనిచ్చే మహా వృక్షాన్నే ఆశ్రయించాలి గానీ, ఎండిన మ్రోడును పట్టుకొని వ్రేళ్లాడుతారా? ఖర్మకొద్దీ పండ్లు దొరక్కపోతే పోనియ్యి, దాని నీడనైతే ఎవ్వడూ పీక్కుపోలేడు గదా! సింహం అనుగ్రహం లభిస్తే మేక కూడా అడవిలో

నిర్భయంగా ఇష్టం వచ్చినట్లు తిరుగుతుంది- తెలీదా? అట్లా శౌర్యవంతులను చేరిన చిన్న ప్రాణులకు కూడా గౌరవం అబ్బుతుంది. స్వయంగా ప్రీతిపాత్రులు కానివాళ్లు కూడా సర్వ జగత్తుకూ గౌరవనీయులై పోయి కూర్చుంటారు. ఇంక స్వయంగా గొప్పదనం ఉన్న వాళ్ల గురించి ఏమని చెప్పాలి?

నీచుడిని ఎప్పుడూ సేవించకూడదు. అట్లా చేరితే వారిపై ముందు ఉన్న పాటి గౌరవం కూడా పోతుంది. కల్లు త్రాగినవాడి చేతిలో ఉన్న పాలకుండని కూడా జనాలు 'కల్లుముంత' అనే అంటారు. నీచుల్ని సేవించటాన్ని మించిన కుక్క బ్రతుకు వేరే ఏదీ లేదు. నీచసేవలో పడ్డ శ్రమ యావత్తూ నిష్ఫలమే అవుతుంది.

అంతేకాదు, దాని వల్ల మనసులోని కోరిక ఏమాత్రం ఈడేరదు. హీనులైన వాళ్లను ఆశ్రయించుకొని ఉంటే కొన్ని ఆపదలు కూడా ఎదురవుతాయి. అట్లాంటివాళ్ల బ్రతుకులో దు:ఖమే తప్ప, సుఖం ఏనాటికీ రాదు. ఎప్పుడైనా తప్పి జారి, అనుకున్న కోరికలు ఏవైనా నెరవేరినప్పటికీ, అవి నిలువవు, తక్కువ నీళ్లున్న చెరువులో చేరిన చేపలాగా, నీచుడిని చేరినవాడు కూడా ఆ నీచుడితో పాటే నశిస్తాడు. అట్లా నశించే ముందు కూడా సుఖాలేవీ ఒనగూరవు. ఖడ్గమృగానికి ఎదురయినట్లు వానికి అడుగడుగునా గండాలే ఎదురవుతాయి.

అట్లాంటి నీచులతో క్షణకాలమైనా కలిసి ఉండరాదు; నిలిచి మాట్లాడరాదు; మంచివాళ్లతో సహవాసం వల్ల కోరికలన్నీ ఎట్లా ఈడేరుతాయో, అట్లాగే చెడ్డవాళ్ల సహచర్యం వల్ల సకల కష్టాలూ వచ్చి చుట్టుకుంటాయి. పాత్ర ఆకారాన్ని నెయ్యి ధరించినట్లు, ఆధారం కొద్దీ అధారపడేది ఉంటుంది. అద్దంలో పెద్ద ఏనుగు కూడా చిన్నదై కనబడ్డట్లు, తక్కువ వాళ్లను ఆశ్రయించుకొని ఉన్న సమర్థుడు కూడా తక్కువ వాడిగానే కనబడతాడు.

అందువల్ల తక్కువ వాళ్లను సేవించటంలో ఆవగింజంత మేలు కూడా జరగదు. పొట్ట కూటి కోసం అలాగ తక్కువ వాళ్ల కాళ్లు

పట్టుకొని కష్టజీవనం సాగించేకంటే మానం, మర్యాద ఉన్న వాడు నిశ్చల చిత్తంతో అడవిలో ఉండి ఆకులు అలములు తింటూ సుఖంగా కాలం గడపటం ఎంతో మేలు. లేదా, గొప్పవాడెవరికైనా పాదదాసులమని పేరు పెట్టుకొని, గౌరవానికి భంగం కలుగకుండా బ్రతకటం అంతకంటే ఉత్తమం.



అంతేకాదు, లోకంలో ఎవరైనా రాజుని ఆశ్రయించుకొని ఉండేది ఎందుకు? 'తమకు ఏనాడైనా కష్టకాలం వచ్చినప్పుడు అతను తమను ఏదో ఒక విధంగా కాపాడతాడు' అనే గదా!? అట్లాంటి రక్షణ ఆ రాజువల్ల లభించక పోతే, ఇక వాడివల్ల ప్రయోజనం ఏముంది?

అట్లాంటి రాజు లేకపోతే ఏదో ఒక రకంగా, చివరికి మోసం చేస్తూ అయినా- హాయిగా బ్రతుకవచ్చు. ఇది వరకు కుందేళ్లు అలాగే కదా, కోరికలన్నిటినీ తీర్చుకొని సుఖంగా బ్రతికింది? ఆ కథ చెబుతాము, విను-

కుందేళ్లు-ఏనుగు ల కథ

గతంలో ఒకసారి తీవ్రమైన కరువొకటి వచ్చింది. వానలు లేకపోవటం వల్ల అడవిలోని చెరువులు, గుంతలు అన్నీ పూర్తిగా ఎండిపోయాయి.

అప్పుడా అడవిలోని ఏనుగులు అన్ని బాధలనూ అనుభవించి, చివరికి ఒకనాడు తమ గుంపుకు రాజయిన పెద్ద ఏనుగు దగ్గరికి పోయి దీనంగా "స్వామీ! ఏమని చెప్పమంటారు? ఈ దాపులలో మేం ఎల్లప్పుడూ స్నానాలు చేసి నీళ్లు త్రాగే పెద్ద చెరువులో కూడా ఈ ఏడాది కరువు వల్ల కేవలం కొంచెం బురద మాత్రమే మిగిలి ఉన్నది. ఇక చిన్న చెరువుల సంగతి

తలచేటట్లే లేదు. తమరి పాదాలను సేవించుకుంటూ ఎప్పటికీ అలాగే సుఖంగా ఉండిపోతాం అనుకున్నాం; కానీ మా దురదృష్టం కరువు రూపంలో పీడిస్తుంటే, దానికి బలయ్యేకాలం సంప్రాప్తించింది. ఇట్లాంటి చెడ్డకాలం వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఎప్పుడు ఏమోతుందో ఎవరు కనుక్కోగలరు, కాలంతప్ప?

ఈ కాలం లాంటిది వేరేదేదీ లేదుగదా! మేమంతా తమరి మీద ఆధారపడి జీవిచేవాళ్లం. ఈ ఆపత్కాలంలో మా దప్పికను దూరం చేసి, మా కష్టాలను దాటించి, ఆవలి తీరం చేర్చేందుకు తమరి పాదాలే తప్ప మాకు వేరే దారి ఏదీ కనబడటం లేదు. మా కష్టాలను విన్నవించుకొని, తమరి దయను అర్థించటంకోసం వచ్చాము. త్వరగా దీనికి ఒక పరిష్కారాన్ని కనుగొనవలసింది ప్రభూ! వేరే దారి లేదు, మమ్మల్ని ఇక ముంచినా, తేల్చినా తమరిదే భారం" అన్నాయి.

అది విని ఆ ఏనుగుల నాయకుడి మనస్సు చాలా పరితపించింది. అది కొంతసేపు ఆలోచిస్తూ ఊరికే ఉండిపోయింది. తర్వాత అది వేగంగా నడిచే ఏనుగు నొకదాన్ని పిలిచి, "నువ్వు ఇప్పుడే , వేగంగా పోయి వెతుకు. ఇక్కడికి దగ్గరలో ఎక్కడైనా మంచినీళ్లతో నిండిన సరస్సు వేరేదేదైనా ఉన్నదేమో చూడు. ఇక్కడే ఉన్నట్లు తిరిగి రావాలి. సోమరితనంతో సరిగ్గా వెతకకుండానే తిరిగి వచ్చేవు, జాగ్రత్త" అని పంపించిందది.



ఆ ఏనుగు కూడా వినయంతోటీ, ఇష్టంతోటీ, భయంతోటీ తమ నాయకుడి ఆజ్ఞను శిరసావహించి, ఆ క్షణాన్నే బయలుదేరి

అమిత వేగంతో పోయి వెతకటం మొదలుపెట్టింది. అట్లా అడవి అంతా వెతుకుతున్న ఆ ఏనుగుకు ఒక పెద్ద మంచినీటి చెరువు కనబడగానే, దాని సంతోషానికి హద్దులు లేనట్లయింది.



పరుగు పరుగున వెనక్కి తిరిగి వచ్చి అది తమ నాయకుడికి ఆ సంగతి విన్నవించింది. "ప్రభూ! తమరి యీ సేవకుడి ప్రయత్నం సఫలమైంది. అడవి మధ్యలో తియ్యని మంచినీళ్లతో నిండిన సరస్సొకటి కనబడింది. ఇక తమ యీ దాసులు అందరి తోటీ విచ్చేయటమే తరువాయి. అక్కడ మన వారందరూ తృప్తిగా కడుపునిండా నీరు త్రాగ వచ్చును" అన్నది.

దానికి ఆ ఏనుగుల నాయకుడు కూడా చాలా సంతోషపడ్డది. వార్త తెచ్చిన ఆ ఏనుగును అభినందించి, అది తన సహచరులనందరినీ వెంటబెట్టుకొని గబగబా ఆ మడుగు దగ్గరికి పోయింది. నీటిని చూడగానే ఏనుగులన్నీ పొంగిపోయి, ఆ నీటిలోకి దూకి, కడుపు నిండుగా నీళ్లు త్రాగి, మెడ లోతు ఉన్న ఆ నీళ్లలో మునిగి, తేలి, ఓలలాడటం మొదలుపెట్టాయి.

(..తరువాతది మళ్ళీ..)

తిక్కప్రశ్న

ఎలుగు బంట్ల బొచ్చు అంత దుబ్బగా ఎందుకుంటుంది?

అడవిలో వాటికి హెయిర్‌కట్ చేసేవాళ్లు ఎవరూ ఉండరు కదా, అందుకని.



అన్న-తమ్ముడు

రచన: కె.కీర్తి, 8 వతరగతి, అభ్యాసవిద్యాలయం, విజయవాడ.

అనగనగా అనంతపురంలో రాజారావు అనే రైతు ఉండేవాడు. అతనికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు అన్నయ్య, చిన్నవాడు చిన్నయ్య. రాజారావుకు పెద్దగా ఆస్తులేమీ లేవు. 'తమ తర్వాత పిల్లలు ఎలా బ్రతుకుతారు?' అని రాజారావు భార్య ఆందోళన పడుతూ ఉండేది. అయితే 'పిల్లలిద్దరూ తెలివైనవాళ్ళే. ఎట్లాగో వాళ్ల పొట్ట వాళ్ళు పోసుకొని బ్రతుకుతారులే' అని నచ్చజెబుతుండేవాడు రాజారావు.

ఒక రోజున అతను పిల్లలిద్దరినీ పిల్చి "నాయనా, మాకు ఓపిక ఉన్నంత కాలం మిమ్మల్ని పెంచాం. ఇక మా వల్ల కాదు. మీరు ఎలాగైనా కష్టపడి, నీతిగా బ్రతకండి. ఇదిగో మన ఆస్తంతా ఈ ఒక్క ఆవే. దీన్ని తీసుకొని వెళ్లండి మీరు. ఎలా బ్రతుక్కుంటారో బ్రతుక్కోండి. ఒక సంవత్సరం పాటు మీకిది పరీక్ష అనుకోండి. సొంతగా జీవించటం మరీ

కష్టమనిపిస్తే వెనక్కి తిరిగి వచ్చెయ్యండి. మళ్ళీ అందరం ఆలోచిద్దాం" అని చెప్పి పంపాడు.

"సరేలే నాన్నా! మేం కూడా పెద్దవాళ్లమయ్యాం, మా కాళ్లమీద మేము నిలబడి చూపిస్తాం" అని ఆవును తీసుకొని బయలుదేరారు ఇద్దరూ.

అట్లా ఇద్దరూ నడుస్తూ పోతూ ఉంటే రెండు దారుల కూడలి ఒకటి వచ్చింది. అన్న అన్నాడు "తమ్ముడూ, మన దగ్గరున్నది ఈ ఒక్క ఆవే. దీన్ని అమ్మితే డబ్బులువస్తాయి, వాటిని మనం ఇద్దరం పంచుకోవచ్చు. కానీ డబ్బులు ఖర్చు అయిపోవచ్చు. ఆ తర్వాత మనకు మన ఆవూ దక్కదు. అందుకని నువ్వు ఈఆవును తీసుకొని ఇటువైపు వెళ్ళు. నీకు నచ్చిన ఊళ్ళో దీన్ని పెట్టుకొని బ్రతుకు. ఆవుని నమ్మి చెడినవాడు లేడు. నువ్వు జీవితంలో పైకి వస్తావు. నేను రెండో దారిలో వెళ్తాను. నా తెలివితేటల్ని ఉపయోగించి బ్రతుకుతాను. ఒక సంవత్సరం తర్వాత మనం మళ్ళీ కలుద్దాం. అప్పటికి ఎవరు ఎలా ఉంటారో చూద్దాం" అని.

తమ్ముడికి అది నచ్చలేదుకానీ, అన్న గట్టిగా చెబితే కాదనలేక, 'సరే' అన్నాడు.

తమ్ముడు ఆవుని తీసుకొని వెళ్ళి తనకు ఎదురైన మొదటి ఊళ్లో చేరుకున్నాడు. ఆవు పాలు పోసి, ఆ వచ్చిన డబ్బుతో జీవించటం మొదలు పెట్టాడు. కొంతకాలం జీవితం బాగానే గడిచింది, కానీ అకస్మాత్తుగా ఆ ఆవుకి ఏదో తెలీని జబ్బు చేసి చచ్చిపోయింది. చిన్నవాడు చాలా బాధపడ్డాడు- కానీ చేసేదేమున్నది? ఆ ఆవుని అడవిలోకి తీసుకెళ్ళి, దాన్ని కోసి, చర్మాన్ని ఒలిచి, ఎండేందుకని దాన్ని ఒక చెట్టు మీద పరచి పెట్టాడు . ఇలా ఒక వారం గడిచింది. ఆ చర్మం బాగా ఎండి ఉంది.

ఆరోజు అమావాస్య. చిమ్మ చీకట్లో కొందరు దొంగలు అదే చెట్టు క్రిందికి చేరుకున్నారు. అందరూ తాము తెచ్చిన బంగారు నాణాలను, నగలను అక్కడ పరచి పంచుకోవటంలో మునిగారు. అంతలో సన్నగా వాన మొదలైంది. టప టప రాలే చినుకులు చెట్టు మీదున్న చర్మం మీద పడటం మొదలు

పెట్టాయి. తోలు ఎండి ఉన్నది కదా, ఒక్కో చినుకూ పడ్డప్పుడు 'ఢం!ఢం!" అని శబ్దం చేస్తున్నది. ఆ శబ్దానికి దొంగలు బెదిరి పోయారు. చెట్టు మీద ఎవరో కూర్చున్నారు అనుకున్నారు. వాళ్ళు ఊళ్ళో వాళ్ళని పిలిచేందుకు పైనుండి డప్పు వాయిస్తున్నారు అనుకున్నారు. తమ సంపాదనను అంతా అక్కడే విడిచేసి ఎటువాళ్ళు అటు పరుగెత్తారు!

ఉదయం తమ్ముడు తోలుకోసం అడవికి వెళ్ళి చూస్తే ఏముంది? చెట్టు క్రింద కుప్పలు కుప్పలుగా బంగారం! తమ్ముడు దానినంతా ఎత్తుకొని ఇంటికి వచ్చాడు. నాలుగు ఆవులు కొన్నాడు. మళ్ళీ పాలవ్యాపారం మొదలు పెట్టి వృద్ధిలోకి వచ్చేసాడు.

ఇక రెండో దారిన వెళ్తున్న పెద్దవాడికి దారిలో ఏడుస్తూ పోతున్న చిన్న పిల్లవాడొకడు ఎదురయ్యాడు. అటువైపు దగ్గర్లో జనాలు ఉండే ప్రదేశాలే ఏమీ లేవు- వీడు ఎక్కడినుండి వస్తున్నాడా, అని ఆ పిల్లవాడిని పలకరించాడు అన్న. వాడు ఎవరో గొప్పవాళ్ళ పిల్లడే; దారి తప్పాడు. అన్న వాడిని బుజ్జగించి, తన వెంట ముందుకు తీసుకెళ్ళాడు. అక్కడ వాడికి తినేందుకు ఏవో చిన్న చిన్న వస్తువులు కొనిపెట్టి, వాడి తల్లిదండ్రులెవరా అని ఆలోచించాడు.



అంతలో వాడికొక పెద్ద బట్టల దుకాణం కనబడింది. అన్న అక్కడికి వెళ్ళి "అయ్యా! నేను మీ దుకాణంలో బట్టల్ని తీసుకెళ్ళి చిన్న దుకాణాల్లో అమ్మి పెడతాను. అందుకు గాను నాకు మీకు తోచినంత మొత్తం ఇద్దురు" అన్నాడు ఆ దుకాణపు యజమానితో. "ఇస్తాం, కానీ నిన్ను ఎట్లా నమ్మేది?" అన్నాడు దుకాణపు యజమాని.

అన్న అప్పుడు తనవెంట ఉన్న పిల్లవాడిని చూపించి వాడు తనకు ఎలా దొరికిందీ చెప్పాడు దుకాణపు ఆయనకు- "అయ్యా! మీరు నాకు ఈ ఒక్కసారికీ అవకాశం ఇచ్చి చూడండి. నేను దుకాణాల్లో సరుకు అమ్మటంతోబాటు ఈ బాబు తల్లిదండ్రులెవరో కూడా విచారించి వస్తాను. నన్ను నమ్మండి. అంతవరకూ ఈ పిల్లవాడిని కూడా మీ దుకాణంలోనే ఉండనివ్వండి" అని బ్రతిమాలాడు.

దుకాణపు యజమాని పిల్లవాడి మొఖం ఒకసారి చూసి, సరే అన్నాడు. అన్నయ్య దుకాణంలో తనకి నచ్చిన చీరలు కొన్ని తీసుకొని, వాటిని వేరు వేరు చిన్న దుకాణాల్లో అమ్ముకొని వచ్చాడు. ఆ క్రమంలోనే అతనికి పిల్లవాడి తల్లిదండ్రులూ ఎదురయ్యారు! ఆ పిల్లవాడి నాన్న కూడా బట్టల వ్యాపారే, ఏదో తిరునాళ్లకెళ్ళి వెనక్కి వస్తుండగా పిల్లవాడు తప్పిపోయాడు. ఇది జరిగినప్పటినుండీ పిల్లవాడి తల్లి ఏకధాటిగా ఏడుస్తున్నది! ఆ వ్యాపారి వెంటనే అన్నయ్య వెంట వచ్చాడు. తమ పిల్లవాడు భద్రంగా ఉండటం చూసి అతన్ని చాలా మెచ్చుకున్నాడు. అతనికి బట్టలమ్మటంలో చాకచక్యం ఉన్నదని కనిపెట్టి, అతన్ని తనవెంట తీసుకెళ్ళి తన దుకాణంలో పని కూడా ఇచ్చాడు!

అలా నమ్మకంగా పనికి కుదురుకున్న అన్నయ్య తన తెలివితేటలతో యజమానికి మంచి సలహాలనిస్తూ అతని వ్యాపారాన్ని చాలా వృద్ధిలోకి తెచ్చాడు. ఒక సంవత్సర కాలంలో వాళ్ల దుకాణం పెద్దదైపోయింది. అతని పట్ల కృతజ్ఞతతో యజమాని ఆ వ్యాపారంలో అతనికీ ఒక వాటా ఇచ్చాడు!

సంవత్సరం పూర్తయ్యే సమయానికి అన్న, తమ్ముడు ఇద్దరూ ఊరు చేరుకున్నారు. వాళ్ళు జీవితంలో నిలదొక్కుకున్నారని చూసి తల్లి,తండ్రి ఎంతగానో సంతోష పడ్డారు. "చూశావా! 'పిల్లలు ఎలా నెగ్గుకొస్తారు' అని కంగారు పడ్డావు. వాళ్ల రెక్కల బలం మీద వాళ్ళు ఎంత బాగా బ్రతుకుతున్నారో చూడు!" అన్నాడు రాజారావు భార్యతో.





కలిసి చదవండి

రచన: ఆర్.ప్రగతి, 9 వతరగతి, జిల్లాపరిషత్ మాధ్యమిక పాఠశాల, వెంకటంపల్లి, అనంతపురం జిల్లా.

జింకలవంక అనే ఊళ్లో గీత, రాధ అనే పిల్లలు తొమ్మిదవతరగతి చదువుతున్నారు. గీతకేమో లెక్కలు బాగా వచ్చు; ఇంగ్లీషు అంత బాగా రాదు. రాధకేమో ఇంగ్లీష్ బాగా వచ్చు; లెక్కలు బాగా రావు. అయితేనేమి, ఇద్దరూ మంచి స్నేహితులు కదా! గీత రాధకు లెక్కలు నేర్పేది. రాధ గీతకు ఇంగ్లీష్ నేర్పేది. ఇలా ఒకరి దగ్గర ఒకరు నేర్చుకోవాలంటే కలిసి చదువుకోవాలికదా? అందుకని వాళ్ళిద్దరూ ఒక రోజు గీత వాళ్ళింటి దగ్గర, ఒక రోజు రాధ వాళ్ళింటి దగ్గర కూర్చొని చదువుకునేవాళ్ళు. అట్లా కలిసి మెలసి చదువుకుంటూ బళ్ళో 'భలే పిల్లలు, బాగా చదువుతారు' అని పేరు తెచ్చుకున్నారు ఇద్దరూ.

ఒకసారి మూడు నెలల పరీక్షలు మొదలయ్యాయి. పిల్లలంతా బాగా చదివారు. పరీక్షలు చక్కగా రాస్తున్నారు. చివరి పరీక్ష

రోజున గీత బయటికి వచ్చేసరికి తన కోసం ఎదురు చూస్తున్నాడు వాళ్ళ నాన్న- "అన్నయ్య వచ్చాడు-నీకోసమే ఎదురు చూస్తున్నాడు, రా!" అని చెప్పి తొందరగా తీసుకెళ్లాడు.

ఆ సంగతి రాధకు ఏం తెలుసు? ఎప్పటి మాదిరే పరీక్ష అయిపోగానే గీత కోసం నిలబడింది. ఎంతసేపు నిలబడ్డా గీత రాలేదు! చివరికి ఎవరో చెప్పగా తెలిసింది- గీత ముందుగానే వెళ్లిపోయిందని.



రాధకు చాలా కోపం వచ్చింది. "ఒక్క మాట కూడా చెప్పకుండా నన్ను వదిలేసి వెళ్లిపోయింది చూడు! నేను ఇక ఎప్పటికీ తనతో మాట్లాడను" అనుకున్నది. మామూలుగానైతే ఆ రోజుసాయంత్రం చదువుకోవడానికి గీత వాళ్ళ ఇంటికి వెళ్ళాలి తను. కానీ పంతం పట్టిన రాధ వెళ్ళనేలేదు. మరునాడు గీత వచ్చింది రాధ వాళ్ళింటికి. ఆ పాప ఎంత మాట్లాడించినా చాలా సేపటివరకూ రాధ బదులివ్వలేదు. చివరికి అన్నది కరకుగా- "నువ్వు నా స్నేహితురాలివి కాదు. నాకు లెక్కలు రావని నీకు అలుసు కదూ?! నువ్వేనా, నాకు లెక్కలు నేర్పేది? నేను మా అన్నయ్యను అడిగి చెప్పించుకుంటాను" అని.

గీతకు కూడా కోపం వచ్చేసింది: "ఓహో! నేను కూడా ఇంగ్లీషు మా అన్నయ్యతో చెప్పించుకోగలను. నువ్వేనా ఏంటి, నాకు ఇంగ్లీషు నేర్పగలిగేది?!" అంటూ గబుక్కున లేచి ఇంటికి వెళ్లిపోయింది.

అటుపైన దసరా సెలవుల్లో అంతా వాళ్ళిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూడనేలేదు. సెలవులు అయిపోయి బళ్ళు తెరిచాక రాధ, గీత

విడివిడిగా బడికి పోసాగారు. ఎవరిపాటికి వాళ్ళు చదువుకున్నారు. మరో మూడు నెలలు ఇట్టే గడిచిపోయాయి. ఆరునెలల పరీక్షలు జరిగాయి.

వాటిలో రాధ, గీతలకు అందరికంటే తక్కువ మార్కులు వచ్చాయి!

"ఇద్దరం కలిసి చదువుకున్నప్పుడు ఎంత మంచి మార్కులు తెచ్చుకున్నామో కదా!? ఇప్పుడు చూడు ఎలా జరిగిందో! నేస్తాలతో కలిసి చదువుకుంటే సంతోషంగా ఉంటుంది. ఒకరి సందేహాలను మరొకరు తీరుస్తారు- అట్లా అందరికీ మేలు జరుగుతుంది" అనిపించింది ఇద్దరికీ.

రాధ గీత దగ్గరకు వెళ్లి మాట్లాడింది- "జరిగినదానిలో తప్పంతా నాదే- నేను నిన్ను సరిగా అర్థం చేసుకోలేదు. నీకు ఇష్టమైతే మనిద్దరం మళ్ళీ కలిసి చదువుకుందామా? ఈసారి నేను నీమీద కోపం చేసుకోను-" అన్నది.

"నేను మీ యింటికి వస్తాను ఇవాళ్ల. రేపు నువ్వు రావాలి మా యింటికి- సరేనా?" అన్నది గీత సంతోషంగా.

ఇప్పుడు వారిద్దరూ మళ్ళీ స్నేహితులైపోయారు. ఇద్దరూ శ్రద్ధగాకలిసి చదువుతున్నారు. తరగతిలో మొదటి మార్కు వాళ్లదే, ఈనాటికీ!

చిట్టి కవిత

మిరపకాయ కారం

చింతకాయ పులుపు

కమలకాయ తీపి

కాకరకాయ చేదు

రచన: కార్తిక్,6వతరగతి, రిషివ్యాలీస్కూల్,మదనపల్లి,చిత్తూరుజిల్లా.



మారిన మనసు

రచన: కె.శరత్‌చంద్రిక, 7 వతరగతి, శ్రీసాయినాథ్‌హైస్కూల్, వరదాపురం, పొదలకూరు, నెల్లూరు జిల్లా.

నరసాపురంలో నివసించే రంగమ్మ-రంగయ్యలు చాలా పేదవాళ్ళు. వాళ్ళకు పిల్లలు లేరు. రంగయ్యేమో తాగుబోతు. రంగమ్మ కూలిపని చేసి, చాలా కష్టపడి డబ్బులు తెస్తే, ఏ పనీ చేయకుండా సోమరిగా ఉంటూ తాగుడుకి డబ్బులు లాక్కునేవాడు రంగయ్య.

పిల్లలు లేరని అసలు ఏనాడూ పెద్దగా విచారించలేదు రంగయ్య. అయినా రంగమ్మకుమాత్రం పిల్లలంటే చాలా ఇష్టం. పిల్లలు లేరన్న బాధకూడా రోజురోజుకూ ఎక్కువ కాసాగింది. బాగా ఆలోచించాక రంగమ్మ చివరికి ఒక నిర్ణయానికి వచ్చింది- ఒకరోజున "అనాధ శరణాలయం నుండి ఒక బాలికను దత్తత తీసుకుందాం" అనేసింది భర్తతో. రంగయ్య దానికి ససేమిరా ఒప్పుకోలేదు. 'మనకే గతిలేదు- ఇంకా మనకు పిల్లలెందుకు?'అన్నాడు. కానీ రంగమ్మ మొండికేసింది. చివరికి ఒక పాపను దత్తు తీసుకొని వచ్చింది. 'దీని ముఖం

చూసన్నా నువ్వు మారితే అంతే చాలు'అన్నది భర్తతో. 'నా పద్ధతులు నావి. ఇంకొకరి కోసం వాటిని ఎందుకు మార్చుకోవాలి?' అన్నాడు రంగయ్య.

పాపకు 'కరుణ' అని పేరు పెట్టి, అల్లారు ముద్దుగా సాకింది రంగమ్మ. రంగయ్య మాత్రం తన పద్ధతుల్ని యథావిధిగా కొనసాగించాడు. రంగమ్మ పాపను ఎత్తుకొని కూలికి పోయేది. వెనక్కి వచ్చాక ఆమె సంపాదనలో సగం లాక్కొనిపోయేవాడు రంగయ్య. ఇలా కొన్నేళ్ళు గడిచాయి. కరుణకూడా కొంచెం కొంచెం పెద్దయింది.

కరుణ చాలా మంచిపాప. ఒకసారి ఆ పాప తన స్నేహితురాళ్ళతో కలిసి ఆడుకోవడానికి ఊరి దాపుల్లో ఉన్న పొలానికి వెళ్ళింది. అక్కడ పొదల మాటున ఆ పాపకు ఒక కుందేలు పిల్ల దొరికింది. దాన్ని చూసి ఆ పాప ఎంతో ముచ్చట పడింది. పెంచుకుందామని దాన్ని ఇంటికి తెచ్చింది. చూడగా దానికి అప్పటికే జ్వరం వచ్చి ఉన్నది!

ఆ కుందేలును చూశాడు రంగయ్య. "ఇలా ఇవ్వు దాన్ని! కూరగా వండుకుందాం, లేకుంటే సంతలో అమ్ముకుందాం!" అన్నాడు.



కరుణ కుందేలును హత్తుకొని బయటికి పరుగెత్తింది. ఆ పాపకు అర్థమైంది- 'చిట్టి కుందేలుకి తమ ఇంట్లో రక్షణ లేదు. రంగయ్య అన్నంతపనీ చేస్తాడు- దాన్ని తినేస్తాడు!'

'మరి ఇప్పుడేం చేయాలి?' రహస్యంగా ఇంటి వెనుకాల ఒక గూడును తయారు చేసి, కుందేలును ఆ గూటిలో పెట్టింది కరుణ. వాళ్ళ అమ్మను, టీచరును అడిగి, వాళ్ళ సహాయంతో దానికి ఆకుపసర్లు అన్నీ తెచ్చి

పెట్టింది. రంగయ్య లేని సమయమంతా తను ఆ గూటి ముందరే, బుజ్జి కుందేలుకు సపర్యలు చేస్తూ గడిపింది. రంగయ్య వచ్చే సమయానికి అక్కడినుండి లేచి పుస్తకాలు పట్టుకోవటం మొదలుపెట్టింది.

ఇదంతా గమనించింది రంగమ్మ. ఆరోజు సాయంత్రం సమయం చూసుకొని రంగయ్యతో అన్నది- "తనకు సంబంధం లేని చిన్న జంతువును కూడా ఎంతో జాగ్రత్తగా సాకుతుంది కరుణ. ఒక చిన్న కుందేలు పిల్ల అనారోగ్యంతో ఉంటే శ్రద్ధగా ఆకుపసరులు ఇప్పించి కాపాడుతోంది చూడు! రాను రానూ నేనూ పెద్దదాన్నవుతాను- నువ్వు కూడానూ. మన ఈ ఆరోగ్యాలు కూడా ఎంతో కాలం ఉండవు. మన శక్తులు ఉడిగిపోయినప్పుడు మనల్నీ కనిపెట్టుకొని సాకుతుంది ఈ పాప. ఇట్లాంటి మనసున్న పాప మనకు దొరకటం మన అదృష్టం. కాబట్టి నువ్వు కరుణను ఏమీ అనవద్దు. ఆ కుందేలు పిల్ల జోలికి వెళ్ళవద్దు" అని నచ్చచెప్పింది.

ఏ కళన ఉన్నాడో, 'సరే' అన్నాడు రంగయ్య. అంతేకాదు- అడవిలోకి వెళ్ళి కొన్ని మందు ఆకులను తెచ్చి ఇచ్చాడు కరుణకు- 'వీటిని కుందేలు ఉన్న గూటిలోపెట్టు. దాని జ్వరం తగ్గుతుంది. నేను దాన్నేం చెయ్యనులే, భయపడకు!' అని చెప్పాడు.

త్వరలోనే కుందేలు ఆరోగ్యం మెరుగైంది. మళ్ళీ చలాకీగా తయారైంది. కరుణ దాన్ని చూసుకొని పొంగిపోయింది. దాన్నీ కరుణనూ చూసుకొని మురిసిపోయాడు రంగయ్య. రంగయ్యలోని మార్పును చూసుకొని రంగమ్మ సంతోషపడ్డది.

కొద్దిరోజుల్లోనే రంగయ్య త్రాగుడు మానేశాడు. తను కూడా కూలి పనికి వెళ్ళి డబ్బులు తెచ్చి ఇవ్వటం మొదలు పెట్టాడు. బాధ్యతగా కుటుంబాన్ని పోషిస్తూ, కరుణను మంచి బడిలో చేర్పించాడు. ఆపైన వాళ్ల కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది!



రాము తెలివి



రచన: సాయి కార్తీక్, 7 వ తరగతి, రిషివ్యాలీ స్కూల్, మదనపల్లి, చిత్తూరుజిల్లా.


రాము చాలా తెలివైన పిల్లవాడు. తను చదివేది నాలుగో తరగతే; కానీ పదో క్లాసు పుస్తకాల్ని కూడా అవలీలగా చదివేస్తాడు. వాడి స్నేహితులు, ఉపాధ్యాయులు వాడిని 'తెలివిగల రాము' అంటుంటారు. రాము వాళ్ళ నాన్న గోపాలం గ్రామ పంచాయితీ సర్పంచి. ఊళ్ళో పెద్ద మనిషి కావటంతో ఆయన రకరకాల వివాదాలను పరిష్కరించాల్సి వస్తుండేది. కొన్ని సార్లు తను పరిష్కరించలేని సమస్య ఏదైనా వస్తే రాముని సాయం అడిగేవారు గోపాలంగారు. అట్లాంటప్పుడు రాము తన తెలివినంతా ఉపయోగించి ఆ సమస్యలకు సమాధానం వెతికేవాడు.

ఒకసారి అట్లాంటి చిక్కు సమస్య ఒకటి వచ్చిపడింది గోపాలం గారికి. ఆరోజున

రంగయ్య, సూరయ్య ఇద్దరూ గొడవ పెట్టుకొని, పరిష్కారం కోసం గోపాలం గారి దగ్గరికి వచ్చారు. "ఏమయిందయ్యా" అని ఆయన అడిగితే రంగయ్య చెప్పాడు- "వారం రోజుల క్రితం నేను నా కుటుంబంతో కలిసి మా అన్నయ్య వాళ్ల ఊరికి వెళ్ళాను. మాకొక ఆవు ఉన్నది. మేమంటే వెళ్తాం గానీ, మా ఆవుని బస్సులో తీసుకుపోలేం కదా?! అందుకని నా స్నేహితుడు సూరయ్య దగ్గర ఉంచాను, ఆవును. తిరిగి వచ్చాక నా ఆవుని ఇవ్వమని అడిగితే "అది నాదే" అంటున్నాడు సూరయ్య. దయచేసి మీరే న్యాయం చెయ్యాలి" అని.

"కాదండీ, ఊరికి వెళ్ళొస్తానంటే 'సరే వెళ్ళి రమ్మ'న్నాను. నాకేం తెలుసు, నా ఆవు మీద వీడి కన్ను పడిందని? ఇన్నాళ్ళ తర్వాత వెనక్కి తిరిగి వచ్చాడు, మా ఆవుని పట్టుకొని తనదంటున్నాడు. నా ఆవు వాడిది ఎట్లా అవుతుంది? మీరే చెప్పండి" అన్నాడు సూరయ్య.

గోపాలంగారికి ఏం చెయ్యాలో తోచలేదు. వాళ్ళిద్దరినీ రకరకాలుగా ప్రశ్నించి చూశాడు. ఏమీ తేలేటట్లు కనబడలేదు. రాము ఏమైనా చెబుతాడేమో చూద్దామని సమస్యను రాముకు అప్పగించారు.



రాము కళ్ళు మూసుకున్నాడు.

కొంచెంసేపటికి రంగయ్యను దగ్గరికి పిలిచి, "మీ ఆవును మీరు ఏమని పిలుస్తారు?" అని అడిగాడు.

"నేను దాన్ని 'శివుడూ' అని పిలుస్తాను" చెప్పాడు రంగయ్య. తర్వాత సూరయ్యని పిలిచి అడిగితే "నేను దాన్ని 'కోటీ' అని పిలుస్తాను" అన్నాడు అతను. దాంతో

రాముకి పరిష్కారమార్గం దొరికినట్లయింది!

వెంటనే ఆవుని చావడికి రప్పించాడు రాము. చుట్టూ అందరూ గుండ్రంగా నిలబడి ఉన్నారు- మధ్యలో ఆవు నిలబడి దిక్కులు చూస్తున్నది బెరుకుగా.

"కోటీ! ఇటు చూడమ్మా! సూరయ్య నిజం చెబుతున్నాడామ్మా, చెప్పు?!" అడిగాడు రాము, ఆవునే చూస్తూ. ఆవు చప్పుడు చేయలేదు.

"ఓయ్,శివుడూ!" నువ్వు చెప్పు!" అన్నాడు రాము ఈసారి. 'శివుడూ' అన్న పేరు వినగానే ఆవు రాము కేసి చూసి రెప్పలార్పింది. చెవులాడించింది. మెళ్లో గంటలు గణగణలాడేట్లు తల ఊపి, ఓ అడుగు ముందుకి వేసింది!

దాంతో అక్కడ చేరినవాళ్ళందరికీ అర్థమైపోయింది- నేరం ఎవరిదో. మరుక్షణం సూరయ్యకూడా తన తప్పు ఒప్పుకొని ఆవును రంగయ్యకు అప్పగించాడు. అందరూ రాము తెలివిని మెచ్చుకున్నారు. గోపాలంగారు నవ్వేసి, సూరయ్యను గట్టిగా మందలించి వదిలేశారు.

అయితేనేమి, పాడి ఆవుమీది ఆశతో స్నేహితుడినే మోసం చేసిన సూరయ్య ఆ తర్వాత ఇక ఊళ్ళో తలెత్తుకు తిరగలేకపోయాడు. చివరికి అతను ఆ ఊరిని విడిచి పెట్టి పోవలసి వచ్చింది!

జోకు

బంటి: ఫోర్డ్ అంటే ఏమిటి?

చంటి: అదొక కారుపేరు.

బంటి:మరి,ఆక్స్ ఫోర్డ్ అంటే?

చంటి: అది కూడా తెల్దా? అదొక ఎడ్లబండి పేరు!



స్నేహితుడి సలహా



రచన: స్రవంతి, 8 వతరగతి, జిల్లాపరిషత్‌హైస్కూల్,జహీరాబాద్.

రావులపాలెంలో ఉండే చంద్రయ్య చాలా వింత మనిషి . అతనికి ఐదు ఆవులు ఉండేవి. అయినా అతను మాత్రం వాటి ఆలనా పాలనా పట్టించుకునేవాడు కాడు. భర్తను ఏమీ అనలేని లక్ష్మమ్మ ఇరుగు పొరుగుల్ని ప్రాధేయపడి, వాళ్ల పొలాల నుండి రోజూ కాస్తంత గడ్డి తెచ్చి వేసి ఎలాగో ఒకలాగా ఆవుల్ని సాకేది. వాటి పాలు అమ్ముకుంటే వచ్చిన డబ్బులతోటే కుటుంబం గడిచేది.

అయినా చంద్రయ్య మాత్రం ఏ పనీ చేయకుండా "నేను అదృష్టజాతకుడిని , ఏదో ఒకనాటికి నాకు కాలం కలిసొస్తుంది. అకస్మాత్తుగా నేను ధనవంతుడినైపోతానట-చూస్తూండండి. అందుకేగద, నేను ఇలా నిశ్చింతగా ఉంటున్నది!" అని అందరితో చెప్పుకుంటూ తిరిగేవాడు.

ఒకసారి చంద్రయ్యను చూసి పోయేందుకు వాళ్ళింటికి వచ్చాడు శివరాం. శివరాం చంద్రయ్యకు చిన్ననాటి మిత్రుడు. చంద్రయ్య పద్ధతిని గమనించిన శివరాం అతన్ని చాలాసేపు మెచ్చుకొని, "చూడగా నువ్వనే అదృష్టం ఏదో నీ తలుపు తట్టే రోజు దగ్గరలోనే ఉన్నట్లుంది. ఏమైందో తెలుసా? -ఈ మధ్యే ఒక యోగిని సంప్రదించాను, నీ గురించి. ఆయనకూడా అదే చెప్పాడు- కోరిన కోరికలన్నిటినీ తీర్చే కామధేనువు ఈసారి మన ఊరి ప్రక్క అడవిలోకే రానున్నదట. ఈ దసరా నుండి సంక్రాంతిలోపలే ఏదో ఒక రోజున వస్తుందట అది! ఆవు కాబట్టి, అది కూడా సహజంగానే అడవిలో ఆవులు మేసే చోటికి వస్తుంది. ఆ ఆవుల్ని మేపుతూ, వాటికి సేవ చేస్తూ కన్పించిన వ్యక్తిని ఆశీర్వదించి పోతుందట అది. నిజంగానే నీలాంటి అదృష్టజాతకులకు మంచి అవకాశం!" అన్నాడు.

అది విన్నాక చంద్రయ్యకు ఎక్కడలేని ఉత్సాహమూ వచ్చింది. ఇక ఆగలేకపోయాడు. ఆరోజునుండీ ఆవుల్ని తనే అడవికి తోలుకెళ్ళటం మొదలుపెట్టాడు. కామధేనువు మంచి పచ్చిగడ్డి ఉండే ప్రదేశాలకు వస్తుంది కాబట్టి, తను ఆవుల్ని అలాంటి ప్రదేశాల్లో తిప్పాడు. ఆ ఆవుల్ని కొట్టకుండా, తిట్టకుండా ప్రేమగా పలకరించుకుంటూ సేవలు చేయసాగాడు.



ఆవులకు కడుపునిండా మేత దొరకటం, పట్టించుకునేవాళ్ళు కనబడటంతో అవి ఎక్కువ పాలు ఇవ్వడం మొదలుపెట్టాయి. దాంతో ఇంటి ఆదాయమూ పెరిగింది; "చంద్రయ్య ఆవుల్ని ప్రేమగా చూసుకుంటాడు" అని చుట్టుపక్కలవాళ్ళు

కూడా కొందరు తమ ఆవుల్ని చంద్రయ్యకు అప్పగించారు.

ఎట్లాగూ అడవికి పోతున్నాడు కనక, ఇంట్లో వంటకు కావల్సిన పుల్లలను, కట్టెలను ఏరుకొచ్చేవాడు చంద్రయ్య. అప్పుడప్పుడూ కుంకుడుకాయలు, చింతపండు లాంటివి కూడా తెచ్చేవాడు. కొంచెం ఊపిరి పీల్చుకున్న లక్ష్మమ్మ తమ పొలంలో ప్రాణం పెట్టటమే కాక, వేరేవాళ్ళపొలాల్లోకూడా పనికి ఒప్పుకోవటం మొదలుపెట్టింది. ఇంకేముంది, సంక్రాంతి పండుగ వచ్చేసరికి వాళ్ల ఇల్లు ధనధాన్యాలతో కళకళలాడింది.

పండగరోజు చంద్రయ్య ఇంటికి వచ్చాడు శివరాం. "నీకు అదృష్టం కలిసి వచ్చినట్లుంది గద, చంద్రయ్యా! ఇంట్లో సంతోషమూ, తృప్తీ బాగా కనిపిస్తున్నై" అన్నాడు కొంచెం జాగ్రత్తగా, కామధేనువు సంగతి అతనికి గుర్తుకొస్తుందేమోనని భయపడుతూ.

"ఏం చెప్పను శివరాం, నువ్వు చెప్పాక ఎంత వెతికినా నాకు మాత్రం కామధేనువు కనిపించలేదు. అయితే ఎలా పడిందో గాని, దాని దృష్టి పడిందనుకుంటాను నామీద- నిజంగానే నా మనసులో ఉన్న కోరికలన్నీ నెరవేరాయి. నేను ప్రయోజకుడినయ్యాను. కామధేనువు కటాక్షం వల్లనే కావొచ్చు, నాకు నీలాంటి మంచి మిత్రుడి సలహా దొరికింది!" అని శివరాంని మెచ్చుకున్నాడు చంద్రయ్య, సిగ్గుగా నవ్వుతూ.


జోకు

బన్ని: డాడీ! ఒకటి పెద్దదా? ఇరవై పెద్దదా?

డాడీ: ఇరవయ్యేపెద్దది, దేనికిరా అడిగావ్!

బన్ని: మరేంలేదు...నాకు మా క్లాసులో ఇరవయ్యవ ర్యాంకు వచ్చింది,అందుకు!


చందన్ కుమార్ కథ
చివరిభాగం- అసలు ఏమైంది?
అనురాగ్ గోదావరి, ఆరవ తరగతి
కంపు మాపకం ఉన్నది ఇక్కడే...
చందన్ కుమార్ నోటిలోంచి వెలువడే కంపు స్థాయి..
కంపు మాపకంలోంచి చూస్తున్న డాక్టరు గారి కన్ను...
దొరికింది!
గొంతులోపల ఇదేంటి... ఏదో పువ్వు!!
డాక్టరు గారు కళ్ళు మూసుకున్నారు.
ఇంకొంచెం సేపుంటే ఈ వాసనకు నేనూ పడిపోయేటట్లున్నాను...
బయటికి వచ్చేసింది!!
మీ సమస్య తీరింది, ఇక ఫీజు చెల్లించండి.
ఏ సమస్య? నేను ఇక్కడికెందుకు వచ్చాను?
చందన్ కుమార్‌కి అసలు ఏం జరిగిందో ఏమీ గుర్తులేదు! మొత్తం మరుపు!!@@!!



జ్ఞానం-పాండిత్యం



రచన: యు.రాజశేఖర్, గణిత ఉపాధ్యాయుడు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నేకొత్తపల్లి.

అది ఒక పల్లెటూరు. ఆ ఊళ్లో అందరూ శాంతి సౌఖ్యాలతో, సమ భావంతో, కలిసి మెలిసి జీవించేవాళ్లు. ఆ ఊరికి ఒక సాంప్రదాయం ఉండేది: మంచి పండితుల్ని , తత్త్వవేత్తలను అప్పుడప్పుడు వాళ్ళ ఊరికి ఆహ్వానించేవాళ్ళు; వాళ్ల చేత ఉపదేశాలు, ఉపన్యాసాలు ఇప్పించుకునేవాళ్లు. వాటి ద్వారా ఊళ్ళోవాళ్లంతా మంచి విలువలను పెంపొందించుకొనే వాళ్ళు. దీని వెనక ఉన్నది, ఆ ఊరి పెద్ద త్యాగయ్య. ఆయన బాగా చదువుకున్నవాడు, శాంత స్వభావి, మంచి తెలివైనవాడు కూడా.

ఒకసారి ఆయన మంచి పేరు గడించిన పండితులు ఇద్దరిని తమ ఊళ్ళో ప్రసంగించేందుకుగాను ఆహ్వానించారు. ఊళ్ళోవాళ్ళు ఉపన్యాస వేదికను సర్వాంగ

సుందరంగా తీర్చిదిద్దారు.

ఆరోజు ఉదయం పండితులిద్దరూ ఊరు చేరారు. త్యాగయ్యగారి ఇంట్లోనే వారికి విడిది ఏర్పాటు చేశారు. ఆ పండితుల రాకతో తన ఇల్లు పావనమైందని అనుకున్నారు త్యాగయ్యగారు. కొద్ది సేపు అవీ-ఇవీ మాట్లాడిన తర్వాత వాళ్ళలో మొదటి పండితుడు స్నానాల గదిలోకి వెళ్ళాడు, స్నానం చేసేందుకు.

అంతలో రెండవ పండితుడు రహస్యం చెబుతున్నట్లు గొంతు తగ్గించి త్యాగయ్యతో ఇలా అన్నాడు: "ఇప్పుడు స్నానానికి వెళ్ళాడు చూశారా, పైకి పండితుడు! కానీ నిజానికి వీడు ఒక దున్నపోతు. ఆధ్యాత్మిక జ్ఞానం ఏమాత్రం లేదు వీడికి. వట్టి అహంకారి. ఉపన్యాసాలు ఇవ్వటం తప్ప, జ్ఞానం అంటే ఏంటో తెలీదు వీడికి. నా సరసన వీడు ప్రసంగించడం కూడా ఇష్టం లేదు నాకు!" అని.

అంతలో మొదటి పండితుడు స్నానం ముగించుకొని వచ్చాడు. రెండోపండితుడు లేచి స్నానం చేసేందుకు వెళ్లాడు. ఇప్పుడు మొదటి పండితుడి వంతు వచ్చింది. అతను త్యాగయ్యతో గుసగుసగా అన్నాడు: "ఈ గాడిదను ఎందుకు పిలిపించారు? వీడికి ఏ జ్ఞానం ఉందని మీరు భావించారు? వీడికి "అహం జాస్తి, సంస్కారం నాస్తి". ఎన్ని జన్మలు ఎత్తినా నాతో వీడు సమం కాజాలడు" అని.



ఇద్దరి మాటల్నీ మౌనంగా విన్నారు త్యాగయ్యగారు. కొంతసేపటికి పండితులిద్దర్నీ భోజనానికి ఆహ్వానించారు. ఇద్దరికీ ఎత్తైన పీటలు వేసి, ప్రత్యేకంగా తెప్పించిన మంచి

అరటి ఆకులు వేసి కూర్చోబెట్టారు. ఇద్దరూ భోజన ప్రియులు కావటంతో ఎట్లాంటి వంటకాలు రానున్నాయో అని ఊహించుకుంటూ కూర్చున్నారు. అంతలో వడ్డించేవాళ్ళు వచ్చి హడావిడి చేస్తూ ఇద్దరి అరిటాకులలోనూ గడ్డి, చిత్తు కాగితాలు, ఆకులు, అలములు వడ్డించారు. "మీకు ఇష్టమైనవేవో కనుక్కొని మరీ ప్రత్యేకంగా చేయించాను. తినండి తినండి" అన్నారు త్యాగయ్యగారు దగ్గర కూర్చొని.

పండితులిద్దరు ఆశ్చర్యపోయారు. ఆగ్రహించారు. చటుక్కున లేచి నిల్చున్నారు- "ఏంటిది?! మమ్మల్ని ఇలా అవమానించడానికా, మీ ఊరికి పిలిపించింది?" అని గట్టిగా అరిచారు.

త్యాగయ్యగారు చిరునవ్వు నవ్వుతూ అన్నారు: "అయ్యా! తమరు ఇద్దరూ ఒకరికొకరు మిత్రులని లోక ప్రసిద్ధం. వారు మాతో ముచ్చటిస్తూ తమరిని 'దున్నపోతు' అన్నారు. తమరేమో 'వారు గాడిద' అని శలవిచ్చారు. 'సర్వజ్ఞులైన పండితులు కదా, తమరు; తమరి నిజ స్వభావాలకు తగిన భోజనమే చేస్తారేమో, మనుష్యులు తినే ఆహారం పెడితే తినరేమో' అనుకొని, ఎవరేది తింటారో కనుక్కొని, ఎంతో శ్రమపడి మరీ తెప్పించాను. తినండి తినండి" అని.

పండితులిద్దరూ సిగ్గుతో తలవంచుకున్నారు. తమలోని అహంకారాన్ని గుర్తించి ఇద్దరూ త్యాగయ్యగారికి క్షమాపణలు చెప్పారు. త్యాగయ్యగారు వారిని మన్నిస్తూ "విజ్ఞులు, పెద్దలు- తమరే నన్ను మన్నించాలి. చిన్నతనంకొద్దీ చొరవ తీసుకున్నాను తప్ప, మరోలా అనుకోకండి" అని వాళ్లను తగిన విధంగా సత్కరించి పంపారు.

ఆరోజు సాయంత్రం పండితులిద్దరూ ఔదార్యం గురించీ, జ్ఞానం గురించీ జనరంజకంగా ఉపన్యసించారు!



భయం

రచన: శ్రీ బమ్మిడి జగదీశ్వరరావు గారు, హైదరాబాదు.

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి చుట్టూ చెట్టూ, చేమా, పొలమూ పుట్రా ఉన్నాయి. ఆ పొలాల మధ్యలోంచే వూళ్ళోకి వచ్చే పోయే దారి వుంది. ఆ దారి వేరే వూళ్ళకు పోయే దారులను కలుపుతుంది. అలా కలిసే కూడల్లో మనుషులు ఒకరికొకరు ఎదురవుతారు. పలకరించుకుంటారు. ఒకరి పొడ ఒకరికి గిట్టకపోతే ముఖాలు తిప్పుకొని ఎవరిదారిన వాళ్ళు పోతూ వుంటారు.

అది మనుషుల కథ. మామూలు కథ.

మరి మనుషులకు వేరే జీవులు ఎదురయితే ఏమవుతుందో, ఇదే ఇంకో కథ.

అవాళ-

మనిషి పాము ఒకరికొకరు ఎదురయిపోయారు.

'అమ్మో విషప్పురుగు. దాని కోరల్లో విషం..' అని భయంతో ఆగిపోయాడు మనిషి.

'అమ్మో విషప్పురుగు. మనకు కోరల్లోనే విషం. మనుషులకు నిలువెల్లా విషమే..' అని భయంతో ఆగిపోయింది పాము.

ఇద్దరూ అలాగే రెండు క్షణాలసేపు ఒకరివంక ఒకరు చూస్తూ వుండిపోయారు.

మనిషి వెనక్కి తగ్గుదామనుకున్నాడు. అడుగు తీసి అడుగు వెనక్కి వేద్దామనుకున్నాడు. కానీ పాము వెంట పడితే..? వెంటపడి కాటేస్తే..?' ఆలోచనలతో ఆగిపోయాడు.

పాముకూడా వెనక్కి తగ్గుదామనుకుంది. జరజరా వెనక్కి వెళ్ళిపోదామనే అనుకుంది. కానీ మనిషి వెంటపడితే..? వెంటపడి కొడితే..?' ఆలోచనలతో ఆగిపోయింది.

'నన్ను కాటెయ్యద్దు..'భయం భయంగా అనుకున్నాడు మనిషి.

'నన్ను కొట్టొద్దు..' భయం భయంగా అనుకుంది పాము.

ఒకరి మాటలు ఒకరికి వినిపించలేదు.

'నా దారిన నన్ను పోనీ..' భయంతోనే నిల్చున్నాడు మనిషి.

'నీ దారిన నువ్వు పో..' భయంతోనే చుట్టుకుని వుంది పాము.



మనిషి భయపడుతూనే అడుగు వెనక్కి తీసాడు.

పాము భయపడుతూనే పడగను దించింది.

వాతావరణం ప్రశాంతంగా మారింది. గాలి వీచింది. ఆ అలికిడికి ఇరువురూ ఉలిక్కి పడ్డారు. భయం పెరిగి అలజడీ, ఆందోళనా ఎక్కువయిపోతోంది.

ఒకరికొకరు హాని చేస్తారన్న భయమే ఇద్దరిలోనూ!

ఆ భయంతోనే బుస్సుమంటూ పాము పడగెత్తి లేచింది.

ఆ భయంతోనే రయ్ మంటూ మనిషి కర్ర తీసాడు.

ముప్పు ముంచుకొచ్చింది.

ఎప్పటిలాగే మనిషి పాము కాటుకి నురగలు కక్కి చావలేదు.

ఎప్పటిలాగే పాము మనిషి చేతిలో దెబ్బలు తినేసి చావలేదు.

ఒక్క క్షణం రెండు పక్షాలు అలాగే నిలబడ్డాక-

పాము పడగ దించి పక్కకు పాక్కుంటూ పోయింది.

మనిషి కర్ర దించి తన దారిన తానూ పోయాడు.

ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయాక- ఎవరి వల్ల ఎవరికీ హాని లేదన్నది తెలిసాక- భయం పోయింది. బతుకు మిగిలింది!

చిలిపి ప్రశ్నలు-తిక్క జవాబులు

సినిమాల్లో నటించే కుక్క యజమానిని ఇంటర్వ్యూ చేస్తే ఏమన్నాడు?

"మా కుక్కని వెటర్నరీ డాక్టరు చెయ్యాలనుకున్నాం కాని అది యాక్టరయింది" అన్నాడు!!

వృద్ధ మహిళా పేషెంట్ ఎందుకు మురిసిపోయింది!?

"సాధారణంగా ఇలాంటి జబ్బు యువతులకు మాత్రమే వస్తుంది" అని వైద్యుడు అన్నాడుగా!

"బంగారం ఎందుకు దొంగిలించావ్" అని జడ్జి అడిగితే దొంగ ఏమన్నాడు?!

"అక్షయతృతీయ సందర్భంగా" అన్నాడు!!

-శ్రీ వివియస్ మూర్తిగారు, చొదిమెళ్ళ.



మార్గం చూపిన మొసలి



రచన: పుల్లయ్య, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల, గడ్డంనాగేపల్లి, నార్పల మండలం, అనంతపురం జిల్లా. మార్పు చేర్పులు: కొత్తపల్లి.

మించలవారికోట గ్రామానికి చివరలో ఒక చెరువు ఉండేది. చెరువు గట్టున గణేష్ వాళ్ళు రోజూ ఆడుకుంటూ ఉండేవాళ్ళు. ఒకరోజున వాడు బంతినొకదాన్ని తీసుకొని వెళ్ళాడు అక్కడికి. ఆ సమయానికి మిగిలిన పిల్లలెవ్వరూ రాలేదు ఇంకా. వాడొక్కడే అలా బంతితో ఆడుతుంటే, అది కాస్తా వెళ్ళి చెరువులో ఎక్కడో పడిపోయింది.

గణేశ్ కు ఈత వచ్చు కదా, అందుకని బంతిని వెతుక్కుంటూ చెరువులోకి దిగాడు. అంతలో వాడికి దగ్గర్లో ఏదో కదులుతున్న అలికిడి వినబడింది. ఏంటా అని చూస్తే అది ఒక మొసలి! వలలో చిక్కుకుని గిలగిల కొట్టుకుంటోంది, ఆగి ఆగి.

గణేశ్ పారిపోదామనుకున్నాడు. కానీ 'అది వలలో చిక్కుకొని ఉన్నది కదా, భయపడేదేముందిలే' అని, దానికి దగ్గరగా వెళ్ళాడు, బురదలో నడుస్తూ.

గణేశ్‌ను చూడగానే మొసలి బాధతోటీ సంతోషంతోటీ కన్నీళ్ళు కార్చింది. 'కాపాడు కాపాడు' అని మొరపెట్టుకున్నది. 'నన్ను రక్షించు, ప్లీజ్' అని వేడుకున్నది.

గణేశ్‌కి కొంచెం భయం వేసింది. అయినా 'అది అంతగా వేడుకుంటున్నది గదా' అని జాలికూడా వేసింది. 'నువ్వు క్రూరమృగానివి కదా! నిన్ను వలలోంచి విడిపించగానే నన్ను పట్టుకొని తినేస్తావేమో?' అన్నాడు.

'అయ్యో, నా సంగతి నీకు తెలీదు. నా కన్నీళ్లను చూడు- అబద్ధాలు చెప్పే స్థితిలో ఉన్నానా? మేలు చేసిన వారికి కీడు చేస్తానా?' అని నమ్మబలికింది మొసలి.

గణేశ్‌కి ఏం చెయ్యాలో తోచలేదు. 'పాపం, మంచి మొసలి' అనుకున్నాడు. దగ్గర్లో ఉన్న రాళ్ళు రెండింటిని తెచ్చి, ఆ రాళ్ళ మధ్యలో వల త్రాళ్ళను పెడుతూ వాటిని ఒక్కటొక్కటిగా తెగకొట్టాడు. అలా వాడు సగం వలను కోశాడో, లేదో- మొసలి తల బయటికి వచ్చింది. మరుక్షణంలో అది కాస్తా నోరు తెరచి వాడి కాలును పట్టేసుకున్నది!

'మాట తప్పుతావా? మోసం చేస్తావా? నేను నిన్ను విడిపిస్తున్నానే, నీకు అంత సాయం చేస్తున్నవాడిని మోసగించాల్సినంత అవసరం ఏమొచ్చింది?' అన్నాడు గణేష్, పెనుగులాడుతూ.

'ప్రపంచమే అంత! నా సహజగుణాన్ని నేనెలా వదులుతాననుకున్నావు?' అంది మొసలి- ప్రశాంతంగా, మరింతగా పట్టు బిగిస్తూ.

'పొరపాటు చేశానే' అని గణేష్ చాలా బాధపడ్డాడు. ఎవరైనా సాయం వస్తారేమో అని చూస్తే ఆ దారిన ఎవ్వరూ రావడంలేదు. మిగతా స్నేహితులంతా ఎప్పుడు వస్తారో తెలీలేదు. వచ్చినా వాళ్ళు మొసలిని ఎదిరించి ఏమి చేయగలరు? 'వల వేసిన పెద్దమనిషి ఎవరో వస్తే బాగుండు' అనుకున్నాడు.

మొసలి చేసిన మోసాన్ని భరించలేక-పోతున్నాడు.

అంతలో చెట్టుమీద ఉన్న పక్షులు కిలకిలలాడాయి. గణేశ్ వాటికి తనగోడు వెళ్ళబోసుకున్నాడు. వాడి బాధని చూసి పక్షులూ జాలి పడ్డాయి. 'మేం ఈ మారుమూలన గూళ్ళు కట్టుకుని గుడ్లు పెడుతున్నాం, ఇక్కడకూడా మమ్మల్ని వదలట్లేదు పాడు పాము. వచ్చి మా కళ్ళముందే మా గుడ్లన్నిటినీ తింటోంది. ఈ ప్రపంచం తీరే అంత. ఎక్కడ చూసినా దుర్మార్గులే ఉన్నారు. ఆ దుర్మార్గులు మారరు- వాళ్ళ స్వభావమే అంత' అన్నాయవి.

అటుగా పరుగెడుతున్న కుందేలొకటి వీళ్ళ మాటలు విని ఆగింది. గణేశ్ దానికీ చెప్పుకున్నాడు తన బాధను. అంతావిన్నాక కుందేలు 'చాలా అన్యాయం' అంది. మొసలితో వాదనకు దిగింది. దాన్ని మాటల్లో పెట్టి నోరు తెరిచేలా చేస్తే గణేశ్ బయటపడతాడు అనుకున్నది.

మొసలి ఒకవైపున గణేశ్ కాలును పట్టుకొని, పళ్ళ సందుల్లోంచే కుందేలుతో మాట్లాడటం మొదలుపెట్టింది.

"నీ మాటలు నాకు అస్సలు అర్థంకావటం లేదు. కొంచెం వీడి కాలును వదిలి మాట్లాడు" అంది కుందేలు.



'వాడిని విడిపించుదామని తెలివిగా అలా అంటున్నావా, నీ సంగతి నాకు తెలుసులే' అంది మొసలి.

'అయినా వీడు ఎక్కడ తప్పించుకుంటాడు?

ఒంటికాలితో ఒక్క కుంటు కుంటేసరికి నీ తోకతో నువ్వు వాడిని పది దెబ్బలు కొడతావు- నీదేముంది? ఎలాగైనా వీడు నీ పంట చిక్కిన ఆహారమే!' నవ్వింది కుందేలు, మొసలిని ఉబ్బిస్తూ.

ఆ మాటలకు కొంచెం బోల్తాపడింది మొసలి. కాలును వదులు చేసింది; కానీ పూర్తిగా వదల్లేదు.

అంతలో పైనున్న పక్షుల గుంపు మొత్తం వచ్చిపడింది మొసలి మీద. కొన్ని దాని కళ్ళను పొడిచాయి. వీపును రక్కాయి కొన్ని. మరికొన్నేమో దాని కాళ్ళను గీకాయి. మొసలి అటూ ఇటూ పొర్లింది. దాని క్రింద పడి కొన్ని పిట్టలు పాపం నలిగిపోయాయి కూడా. అయినా పక్షులు దాన్ని వదలలేదు. దాడిని కొనసాగించాయి. ఆ హడావిడిలో మొసలి నోరు విడివడింది. గణేశ్ ఒక్క గెంతులో చెరువు గట్టెక్కి కూర్చున్నాడు. మరు నిముషంలో పిట్టలన్నీ మొసలిని వదిలేసి చెట్టుమీదికి ఎగిరిపోయాయి.

'ఈ దుర్మార్గుల స్వభావమే అంత. మంచిగా చెబితే వినరు వీళ్ళు' అన్నది కుందేలు చెరువు గట్టున కూర్చొని వగరుస్తూ.

'చాలా చాలా థాంక్స్, పిట్టలూ, నాకోసం మీరు అంత శ్రమపడ్డారు!' అన్నాడు గణేశ్, మనసారా పిట్టల్ని మెచ్చుకుంటూ.

'అందరూ చెయ్యి కలిపితే చెయ్యలేనిదంటూ ఏమీ లేదు. ఈసారి రానియ్యి, పాముని! మేం ఏం చేస్తామో చూద్దువు!' అన్నదొక పిట్ట, చెట్టు మీది నుంచి.

'అవునవును. దుర్మార్గుల స్వభావాల గురించి మాట్లాడుకుంటూ ఇన్నాళ్ళూ మేం మా బలాన్ని మర్చిపోయాం. ఇంత పెద్ద మొసలినే పారద్రోలిన మేము ఇక మీద ఆ చెత్త పాముకి భయపడేదేముంది?' అన్నాయి పిట్టలన్నీ, గట్టిగా, గొడవ గొడవగా అరుస్తూ.



గెలిచిన గాలిపటం

రచన: శ్రీమతి రాధ మండువ, ఉపాధ్యాయిని, రిషివ్యాలీస్కూల్, మదనపల్లి.

తిరుమల కొండకి దాపున కొన్ని చిన్న గ్రామాలు దగ్గర దగ్గరగా ఉన్నాయి. ఆ గ్రామాల మధ్య చిన్నకొండలు, పొదలూ ఉన్నాయి.

ఆ గ్రామాల్లో ఉండే పిల్లలందరూ చింతపల్లి బడికి వస్తారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ చదువుల్లో మునిగిపోతారు. మధ్యాహ్న భోజనం తర్వాత రకరకాల కార్యక్రమాలను చేస్తుంటారు. కొంతమంది బొమ్మలు గీస్తుంటారు. కొంతమంది చెక్కతో వస్తువులు చెక్కుతుంటారు. మరి కొందరు కాగితాలతో చెట్లు, పువ్వులు, జంతువులు తయారు చేస్తుంటారు. శని ఆది వారాలు స్కూలుకి సెలవు.

ప్రతి శనివారం నాడూ పిల్లలందరూ గాలిపటాలు తయారు చేసుకుని వాళ్ళ వాళ్ళ ఊర్ల నుంచే ఎగరవేస్తారు. గాలిపటాల పైన కాగితాలతో అందంగా వాళ్ళ పేరు, ఏదో ఒక పలకరింపు సందేశం రాస్తారు. అలా

సందేశాలు పంపుకుంటూ, ఎవరి గాలిపటం అందరికంటే ఎత్తుకు ఎగిరిందో చూస్తూ ఆ రోజంతా సరదాగా గడుపుతారు.

ఆ గ్రామాలన్నిటికీ పెద్ద లక్ష్మయ్య గారు. వాళ్ల అబ్బాయి కార్తీక్ ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఆసారి ఆరు నెలల పరీక్షలలో కార్తీక్‌కు తక్కువ మార్కులు వచ్చాయి. తెలుగులో అయితే ఫెయిలే అయిపోయాడు. సరిగ్గా శనివారం రోజు గాలిపటం ఎగరవేయడానికి వెళ్తున్న కార్తీక్‌ను పిలిచి లక్ష్మయ్య గారు చీవాట్లు పెట్టారు. ఈ బడి మాన్పించేస్తామన్నారు. తొమ్మిది, పది తరగతులకు తిరుపతిలోని ప్రైవేటు స్కూల్లో చేర్పిస్తామన్నారు. కార్తీక్‌కు కోపం, చిరాకు కలిగాయి. తన గాలిపటాన్ని తీసుకుని విసురుగా బయటకి వెళ్ళిపోయాడు.

రకరకాల సందేశాలున్న గాలిపటాలు పైన ఎగురుతున్నాయి. కార్తీక్ కూడా గాలిపటాన్ని గాలిలోకి వదిలాడు. జెల్లావారిపల్లి వంశీ గాలిపటం అన్నిటికన్నా పైన ఎగురుతున్నది. కార్తీక్ మెల్లగా దారాన్ని వదులుతూ వంశీ గాలిపటం కంటే ఎక్కువ ఎత్తుకు పంపించాడు తన గాలిపటాన్ని.

అయితే ఈలోగా ఎక్కడి నుండి వచ్చిందో, ఒక తెల్ల గాలిపటం- పైన- పైపైన- అన్నిటికంటే ఎత్తున- ఎగరసాగింది. అది ఎవరిదో తెలియటంలేదు... దాని మీద పేరు కాని, సందేశం కానీ ఏమీ లేవు.

వెంటనే కార్తీక్ తన గాలిపటాన్ని కిందికి దించాడు. దాని మీద "సమావేశం " అనే సందేశం రాసి మళ్ళీ పైకి ఎగరేశాడు. దాన్ని చూసిన పిల్లలందరూ తమ తమ గాలిపటాలని కిందకు తెచ్చి స్కూలుకి దగ్గరగా ఉన్న బండ మీద సమావేశమయ్యారు. కానీ ఎత్తుగా ఎగురుతున్న తెల్ల గాలిపటం మాత్రం కిందకు రాలేదు. అది అలాగే ఎగురుతోంది ఇంకా... అది ఎవరిదో మరి, ఎవ్వరికీ తెలీలేదు.

'నిబంధనలకు వ్యతిరేకంగా ఎగురుతున్నది ఆ గాలిపటం. దాన్ని కిందకు దింపాలి. అది ఎవరిదో చూడాలి' అని సమావేశం నిర్ణయించింది.

వెంటనే పిల్లలందరూ ఇసుకను చిన్న చిన్న

మూటలుగా కట్టారు. ఆ మూటలను తాళ్ళకి ముడి వేసారు. పైన ఎగురుతున్న గాలిపటం దారం పైకి విసిరారు వాటిని. ఎలాగో ఒకలాగా గాలిపటాన్ని కిందపడవేశారు.

అటుపైన అందరూ నిశ్శబ్దంగా అటు వైపుకి నడిచారు. దూరంగా పడి ఉంది గాలిపటం. అందరూ చేరుకున్నారు అక్కడికి. ఆ గాలిపటం అబ్బాయి కోసం ఎదురు చూడసాగారు.

మెల్లగా అడుగుల చప్పుడు వినవచ్చింది. దారాన్ని కండెకు చుట్టుకుంటూ వచ్చాడు ఒక 10-12 ఏళ్ళ పిల్లాడు. వాడు వీళ్ళ మీదికి తగాదాకు వస్తాడనుకున్నారు పిల్లలందరూ. కానీ ఆ పిల్లాడు వాళ్ళ ఉనికినే గమనించినట్లు లేడు- దారాన్ని చుట్టుకుని, వంగి గాలిపటాన్ని తీసుకోబోయాడు-

ఉదయం నుంచి చిరాగ్గా ఉన్నాడు కార్తీక్. దానికి తోడు 'ఇంత చిన్న పిల్లాడు గాలిపటాన్ని తనకంటే ఎక్కువ ఎత్తుకు ఎగరేశాడని' అసూయ. కోపంగా అరిచాడు కార్తీక్- "ఏయ్! పేరు రాయకుండానే గాలిపటాన్ని ఎగురవేస్తావా? నా సందేశానికి కూడా సమాధానం ఇవ్వలేదేమి?" అని. వెంటనే ముందుకి దూకి, గాలిపటాన్ని కాలితో తొక్కి పట్టి, ఆ పిల్లాడి భుజాన్ని గట్టిగా పట్టుకున్నాడు.



ఆ అబ్బాయి ఏమీ అనలేదు. నిశ్శబ్దంగా కళ్ళెత్తి కార్తీక్ వైపు చూశాడు...ఆ పిల్లవాడికి కళ్ళు లేవు- వాడు గుడ్డివాడు!

మరుక్షణం కార్తీక్ అతన్ని వదిలేసి లేచి

నిలబడ్డాడు. కోపం, చిరాకు ఎటు పోయాయో, వాటి స్థానంలో సిగ్గు, అపరాధ భావన చోటు చేసుకున్నాయి. మిగిలిన పిల్లలందరూ ఆ పిల్లవాడి చుట్టూ గుమి-గూడారు. అతని వివరాలు అడిగారు.



ఆ బాబు పేరు పరమేశ్వర. చిట్టడవిలో ఉన్న చెంచుల గూడెం వాళ్ళ అమ్మమ్మ గారి ఊరు. తిరుపతిలో ఫ్యాక్టరీలో వాళ్ళ నాన్న కూలిపని చేసేవాడు. చిన్నప్పుడు బాబు కళ్ళు బాగానే ఉన్నాయి. కళ్ళల్లో చిన్న చిన్న పువ్వులుగా తెల్లని మచ్చలు ఏర్పడి ఈ మధ్య పూర్తిగా గుడ్డివాడయిపోయాడు. డాక్టరు దగ్గరకు తీసుకువెళితే ఆపరేషన్ చేయాలన్నారు. వాళ్ళ నాన్న అంత డబ్బు ఎక్కడ నుండి తేగలడు? ఇప్పుడు వాళ్ళ నాన్న పని చేసే ఫ్యాక్టరీ కూడా మూతపడింది. అందుకే రెండు రోజుల క్రితం వాళ్ళ అమ్మమ్మ గారి ఊరికి వచ్చారు- ఇక్కడ ఏదైనా పని చేసుకుని బ్రతుకుదామని.

పిల్లలందరూ బాబుని అతని ఇంటి వరకూ వెళ్ళి వదిలి పెట్టి వచ్చారు. ఆ సోమవారం పరమేశ్వర స్కూల్లో చేరాడు. అతడు గాలిపటాన్ని పైపైకి ఎలా ఎగరవేయగలడో అందరికీ ఎప్పుడూ ఆశ్చర్యమే!

సంవత్సరాంతం పరీక్షలు దగ్గర పడటంతో అందరూ మళ్ళీ చదువుల మీద పడ్డారు. లక్ష్మయ్య గారు కార్తీక్‌ను దగ్గర కూర్చోపెట్టుకుని "కార్తీక్! పరీక్షలు బాగా రాయి. మార్కులు బాగా వస్తేనే నీకు తిరుపతిలో సీటు దొరికేది" అన్నాడు.

"ఆ స్కూల్లో ఫీజు ఎంత నాన్నా?" అని

అడిగాడు కార్తీక్.



" రెండేళ్ళకీ కలిపి రెండు, మూడు లక్షల దాకా అవ్వొచ్చు! ఖర్చు ఎంతయితేనేం ? అక్కడ ఎక్కువ క్లాసులు పెట్టి పదవ తరగతిలో మంచి రాంక్ వచ్చేట్లు చదివిస్తారు" అన్నాడు లక్ష్మయ్య.

"నాన్నా! ఆ డబ్బుతో పరమేశ్వర కళ్ళకి ఆపరేషన్ చేయించు. నేను మా నారాయణయ్య సార్ దగ్గర ఎక్కువ క్లాసులు తీసుకుని పదవ తరగతిలో ర్యాంకు తెచ్చుకుంటాను" అన్నాడు కార్తీక్ స్థిరమైన కంఠంతో.

లక్ష్మయ్యకి నోట మాట రాలేదు. తన కొడుకు ఎంతో ఎదిగిపోయినట్లుగా అనిపించింది ఆయనకు. త్వరలోనే పరమేశ్వరకు ఆపరేషన్ జరిగింది. వాడు ఇప్పుడు చక్కగా చూడగలుగుతున్నాడు.

తర్వాతి సంవత్సరం కార్తీక్ తన మాట నిలుపుకున్నాడు. పదవ తరగతిలో స్టేటు ర్యాంకు తెచ్చుకున్న కార్తీక్‌ను లక్ష్మయ్య అక్కున చేర్చుకున్నాడు.



రోడ్డు మీది పాప

రచన: శ్రీమతి సరిత, హైదరాబాదు.

ఐరోపా ఖండంలో ఇటలీ దేశం ఉంది. అక్కడ అలెస్సాండ్రో, రెవిల్డె అనే దంపతులు ఉండేవాళ్ళు. వాళ్ల పాప పేరు మరియా. పన్నెండో తరగతి ఐపోగానే 'నేను డాక్టరునవుదామనుకుంటున్నాను, డాక్టరు చదువులు చదువుతాను' అన్నది మరియా. ఈ కథ ఎప్పటిదనుకుంటున్నారు?- 1880 ల నాటిది! అంటే నూట ముప్ఫై సంవత్సరాలనాటి మాట! ఆ రోజుల్లో ఇటలీ దేశం మొత్తం వెతికినా ఒక్క అమ్మాయి కూడా డాక్టరు చదువు చదవలేదు. మరి ఆ పాప అమ్మా నాన్నలు మాత్రం అందుకు ఎట్లా ఒప్పుకుంటారు? కానీ మరియా పట్టుదల మనిషి. ప్రాధేయపడి, పోరాడి చివరికి వాళ్ళ అమ్మానాన్నలను ఒప్పించింది.

అటుపైన వాళ్లందరూ కలిసి కాలేజీ వాళ్లనీ ఒప్పించాల్సి వచ్చింది! ఎందుకంటే అప్పటివరకూ వాళ్ల కాలేజీలో వైద్యం

చదివేవాళ్లందరూ అబ్బాయిలే మరి! 'అంతమంది అబ్బాయిల మధ్య, ఈ ఒక్క అమ్మాయినీ ఎలా సంబాళిస్తాం, వీలు కాద'న్నారు వాళ్ళు. ఈపాప పట్టుదల చూసి చివరికి వాళ్ళూ 'సరే చూద్దాం' అన్నారు.

వైద్య విద్యలో భాగంగా విద్యార్థులు అందరూ మానవ శరీరాన్ని పరీక్షించాలి. దానికోసం కాలేజీల వాళ్ళు శవాలను తెచ్చి పెడతారు. వైద్య విద్యార్థులందరూ ఆ శవాలను జాగ్రత్తగా సరైన పద్ధతిలో కోసి, శరీరంలో ఏ భాగం ఎక్కడ ఉండేదీ, ఎట్లా ఉండేదీ చూసి నేర్చుకుంటారు. ఆపరేషన్లు చేసేందుకు కావలసిన అనుభవమూ అట్లాగే కద, వచ్చేది!?

అయితే అబ్బాయిలందరూ శవపరీక్షలు చేసే చోట ఈ ఒక్క అమ్మాయినీ ఉండనిచ్చేది లేదన్నారు కాలేజీవాళ్ళు. అట్లా అని శవ పరీక్షలు చెయ్యకుండా డాక్టరు ఎలా అవుతారు, ఎవరైనా? 'అందరూ వెళ్ళిపోయాక, సాయంత్రం పూట ఆమె ఒక్కతే వచ్చి శవపరీక్ష చేసుకునేట్లయితే పర్వాలేదు' అన్నారు పెద్ద డాక్టరు గారు.

మరియూ చాలా ధైర్యం ఉన్న పాప. 'సరేలెండి అట్లాగే కానివ్వండి' అన్నది.

ఆరోజు సాయంత్రం కాగానే చక్కగా ఒక లాంతరు చేతపట్టుకొని, కాలేజీకి చేరుకున్నది.

(మీకు అనుమానం వచ్చిందా, 'లాంతరు ఎందుకు?'అని? ఎందుకంటే అప్పటికి ఇంకా కరెంటు దీపాలు కనుక్కోలేదు మనుషులు! రాత్రి అవ్వగానే ఎవరికి వాళ్ళు దీపాలు, లాంతర్లు వెలిగించుకోవాల్సిందే! అందుకని!)

సరే, ఈ పాప కాలేజీకి చేరుకునేసరికి చీకటి పడుతున్నది. కాలేజీలో ఎవ్వరూ లేరు. ప్రయోగశాలలో చుట్టూ సీసాలు..సీసాల్లో ఫార్మాలిన్ ద్రవంలో- ఒక్కోదానిలో ఒక్కో శరీర భాగం తేలుతూ ఉన్నది- ఒక సీసాలో మెదడు, ఒక సీసాలో కాలు, ఒక దానిలో చెయ్యి, ఒకదానిలో గుండె- ఇలాగ. అంతటా నిశ్శబ్దం అలుముకుని ఉన్నది. మధ్యలో బల్లమీద మానవ కళేబరం పెట్టి ఉంది, కదలకుండా పడి ఉన్నది ఒక శవం!

ఆ వాతావరణాన్ని పాపం, ఊహించలేదు మరియా. క్షణంలో ఆ పాపకు విపరీతమైన భయం వేసింది. గుండెల్లోంచి తన్నుకొచ్చింది వణుకు. కళ్ళు తిరిగినట్టు, మూర్ఛ వచ్చినట్టు అనిపించింది. వెంటనే బయటికి పరుగెత్తుకుంటూ వచ్చింది. వెనక్కి తిరిగి చూడకుండా ఇంటికి పరుగు తీసింది. ఆయాసంతో ఇక పరుగెత్తలేనంత వరకూ పరుగు. అటుపైన మెల్లగా, నీరసంగా నడక.

అప్పుడు గమనించింది మరియా- రోడ్డు ప్రక్కన ఒక పాప కూర్చొని ఆడుకుంటున్నది. పాప చుట్టూ అంతా మురికి, రోత, ఈగలు. అటూ ఇటూ వేగంగా పరుగులు పెడుతున్న వాహనాలు, గుర్రపు బళ్ళ శబ్దాలు. అంగళ్ల వాళ్ళు, బండ్లవాళ్ళు అరుస్తున్నారు, రొద- చీకటి. కానీ ఆ అమ్మాయి ఆడుకుంటున్నది- సంతోషంగా ఉంది. ఆ పాప చేతిలో ఉన్నది ఒక రంగు కాగితం! దాన్ని చూసుకొని మురిసిపోతున్నది ఆ పాప. చుట్టు ప్రక్కల ఏం జరుగుతున్నా, ఎంత జుగుప్సాకర వాతావరణం ఉన్నా పట్టించుకోవటం లేదు- పూర్తిగా తన ఆటలో నిమగ్నమైపోయి ఉన్నది.

మరియా అక్కడే నిల్చున్నది కొంత సేపు. ఆడుకుంటున్న చిన్న పాప లోని సంతోషం, ఆ చీకటి తెరల్లోంచి కూడా దూసుకు వచ్చి మరియా కళ్ళు తెరిపించింది. తన కర్తవ్యం ఏంటో గుర్తుచేసింది.



పారిపోతున్న మరియా ఒక నిశ్చయానికి వచ్చింది. వెనక్కి తిరిగి ధైర్యంగా కాలేజీ చేరుకున్నది. ప్రయోగశాలలోకి వెళ్ళి శవాన్ని కోసి పరీక్షించింది. లాంతరు వెలుగులో వివరంగా నోట్సు తయారు చేసుకున్నది. రాత్రి బాగా చీకటి పడ్డాక ఇల్లు చేరుకున్నది.

ఆ తరువాత ఇక ఆమె వెనక్కి తిరిగి చూడలేదు. ఆమె నిశ్చయం ముందు నిలువలేక భయమే పారిపోయినట్లయింది.

మరియా మాంటిసోరీ ఆ విధంగా ఇటలీ దేశపు మొట్ట మొదటి మహిళా డాక్టరైంది. తనకు కర్తవ్యాన్ని బోధించిన చిన్న పాపను ఆమె మర్చిపోలేదు. ఎంతోమంది మహిళలకు, పిల్లలకు మానవత్వంతో కూడిన వైద్యసేవలు అందించింది మరియా.

ఒకవైపున డాక్టరుగా సేవలు అందిస్తూనే, మరోవైపున గొప్ప విద్యావేత్తగా ఎదిగి చిర స్మరణీయురాలైంది మరియా మాంటిసోరీ.

చిలిపి ప్రశ్నలు-తిక్క జవాబులు

డ్రయివర్‌కి చిరాకు ఎందుకొచ్చింది?!

దిగబోయే సారు పదే పదే సైడ్ మిర్రర్లో జుట్టు సవరించుకుంటున్నాడని!

"ఫీజు ఎక్కువ" అన్న పేరెంట్‌తో ప్రిన్సిపాల్ ఏమన్నాడు?!

"ఏం పర్వాలేదండీ! మీ ఇష్టం! నేటి రూపాయిలే రేపటి డాలర్లు అని మాత్రం మర్చిపోకండి!" అన్నాడు.

"న్యాయంలో అన్యాయం" అంటే!?

జవాబు: దొంగ సర్టిఫికెట్‌తో న్యాయ వాది అవ్వటం!!

'అత్యాశ' అంటే.....?

జవాబు: టికెట్ కొనకుండా లాటరీ రావాలనుకోవటం!

-శ్రీ వివియస్ మూర్తి, చొదిమెళ్ళ



అంతా మనమంచికే

బాగా పేరొందిన పాత తెలుగు కథల్లో ఒకటి, ఈ కథ. ఉదాత్తమైన తాత్త్విక విలువలతో కూడిన ఇలాంటి కథలు మన చుట్టూ చాలా ఉన్నాయి. మీకూ తెలుసేమో, ఈ కథ- అయినా చదవండి, గుర్తుచేసుకోండి.

కథనం: పర్తాప్ అగర్వాల్, *తెలుగు అనుకరణ: నారాయణ*

అనగా అనగా ఒక రాజుగారు ఉండేవారు. ఆయనకొక మంత్రి. ఆ మంత్రి గారికి దేవుడంటే చాలా నమ్మకం ఉండేది. ప్రపంచంలో ఏం జరిగినా 'ఆ భగవంతుడే అట్లా చేయించాడు' అనుకునేవాడు. అందుకని , ఆయనకు ఎవరు, ఎట్లాంటి వార్త చెప్పినా, "అవునవును- చాలా మేలు జరిగింది. అది మన మంచికే; ఎందుకంటే చెడ్డదైతే దాన్ని దేవుడు అసలు జరగనిచ్చేవాడే కాదు!" అనేవాడు.

మంత్రిగారిచ్చే ఇట్లాంటి జవాబులు చాలా కాలం పాటు బాగానే నప్పాయి- ఏమంటే ఆయన చుట్టూ ఎందుకనో, ఎప్పుడూ అదృష్టమే నెలకొని ఉండేది- దురదృష్టం

ఎప్పుడోగానీ ఆయన తలుపు తట్టేది కాదు. అయితే ఒక రోజున ఆయన నిజంగా కష్టాల ఊబిలో చిక్కుకున్నాడు!



ఆరోజున రాజుగారు పొరుగురాజు మీద యుద్ధానికి వెళ్లారు. ఆ యుద్ధంలో ఆయన చిటికెన వేలు ఒకటి తెగిపోయింది. అయితేనేమి, ఆ యుద్ధంలో చివరికి గెలుపు ఆయనదే అయ్యింది. అందరూ ఉత్సాహంగా రాజధానికి తిరిగి వచ్చారు. అటుపైన తనూ, తన సైన్యమూ ఎంత గొప్పగా యుద్ధం చేసిందీ వివరించి చెబుతున్నారాయన, మంత్రిగారికి.

ఆ సమయంలో ఆ రాజుగారు తన చెయ్యి పైకెత్తి చూపిస్తూ- "అయితే ఇన్ని సంతోషాల నడుమ ఒక్క చిన్న దురదృష్టపు సంఘటన కూడా జరిగింది. శత్రురాజుతో భయంకరమైన ఖడ్గయుద్ధం చేస్తున్నపుడు నా చిటికెనవేలు పూర్తిగా తెగిపోయింది. చూడండి!" అన్నాడు.

మంత్రిగారు రాజుగారి వేలును శ్రద్ధగా పరిశీలిస్తూ- "ఇది కూడా మన మంచికేలెండి. ఇలా వేలు తెగిమంచిదే అయ్యింది. లేకపోతే దేవుడు ఇట్లా ఎందుకు అవ్వనిస్తాడు?" అన్నాడు.

రాజుగారికి చాలా అవమానం జరిగినట్లనిపించింది. విపరీతమైన కోపం వచ్చింది. తన వేలు పోయిందని బాధపడే బదులు, ఈ మంత్రి సంతోషపడటం నిజంగా సాహసమే. "ఇలాంటి దుస్సాహసికి శిక్ష తప్పదు- ఇతనిక నగరంలో ఉండేందుకు వీలులేదు. అడవి అంచున ఒక గుడిసె వేసుకొని నివసించాలి. ఇదే అతనికి తగిన శిక్ష!" అన్నాడు కఠినంగా. మంత్రిగారు 'కాదు' అనలేదు. "దైవేచ్ఛ! ఆయన ఎలా

అంటే అలాగే" అని నగరాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయాడు.

ఇట్లా కొద్ది నెలలు గడిచాయి. తర్వాత ఒకరోజున రాజుగారు వేటాడడం కోసం అడవికివెళ్లారు. అక్కడ ఆయనకొక దుప్పి కనబడింది. రాజుగారు దాని వెంటబడ్డారు. అది తప్పించుకొని పరుగెత్తుతూ పోయింది. రాజుగారొక్కరే దాని వెంటపడి తరిమారు. అయితే అప్పటికే సాయంకాలం అయ్యింది; పైగా అవి అమావాస్య రోజులు! అడవంతా చీకటి క్రమ్ముకున్నది.

ఇక చేసేదేమీ లేక రాజుగారు కొన్ని కట్టెల్నీ, కొంచెం గడ్డీ - గాదాన్ని ప్రోగుచేసి, దగ్గర్లోనే ఉన్న మర్రిచెట్టు మీద ఒక మంచెను తయారు చేసుకొని దానిమీద పడుకున్నారు. అలసి పోయి ఉన్నారేమో, బాగా నిద్రపట్టింది. ఆయన నిద్ర లేచేసరికి అప్పుడే తెలవారుతున్నది. చూసుకుంటే ఏముంది? ఆయన కాళ్లూచేతులూ కట్టేసి ఉన్నాయి! ఎవరో బందిపోటు దొంగలు కాబోలు, ఆయన్ని బందీ చేసి, చుట్టూ కూర్చొని ఉన్నారు!

"నన్ను వదిలెయ్యండి" అని రకరకాలుగా చెప్పిచూశారు రాజుగారు. ఏవేవో ఆశలు చూపించారు. కానీ ఆ దొంగలు ఆయన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. పై పెచ్చు, "మేం భవానీ మాతకు బలి ఇచ్చేందుకు తగిన నర మనిషి కోసం ఎన్నో రోజులుగా వెతుకుతున్నాం. ఈ రోజున ఆ మాతే, నిన్ను ఇక్కడికి తీసుకొచ్చింది" అని ఆయన్ని వాళ్ల నాయకుడి దగ్గరికి లాక్కెళ్లారు.

బందిపోట్ల నాయకుడు కూడా రాజుగారిని చూసి చాలా సంతోషపడ్డాడు. అంత అందంగా, బలంగా దృఢంగా ఉన్న వాడిని బలి ఇస్తేనే కదా, దేవి సంతోషించేది!

"ఒరే ! చాలా మంచి వేటనేపట్టి తెచ్చారా! బాగుంది బాగుంది- ఇక సమయం వృథా చేయకండి. వెంటనే యీ వేటకు స్నానం చేయించండి. చూస్తే బలికి వీడు బాగా సరిపోయేటట్లే ఉన్నాడు. అయినా ఎందుకైనా మంచిది- మళ్లీ ఓ సారి జాగ్రత్తగా పరిశీలించండి. బలికి అన్నీ సిద్ధం చెయ్యండి.

'ఇవాళ్లే పండుగ' అని గూడెంలో అంతటా చాటింపు వేయండి! పదండి,అందరూ!" అని తొందరపెట్టాడు.

రాజుగారిని ఇప్పుడు వాళ్లంతా బలిపశువుని చేసేసి, స్నానం చేయించేందుకు తీసుకెళ్లారు. ఆ సమయంలో కనుక్కున్నాడు వాళ్లలో ఒకడు- ఈ నరమానవుడికి ఉండాల్సిన పదివేళ్లూ లేవు, తొమ్మిదే ఉన్నై! వెంటనే వాడు యీ వార్తను నాయకుడికి అందించాడు. నాయకుడు గబగబా వచ్చి చూశాడు. "నిజమే ! వీడికి తొమ్మిది వేళ్లే ఉన్నాయి!" "తొమ్మిది వేళ్ల వాడిని బలి ఎట్లా ఇస్తాంరా?" అడిగాడు నాయకుడు.

మరుక్షణం గూడెంలో డప్పులు ఆగిపోయాయి. నిశ్శబ్దం అలుముకున్నది. గూడెం పెద్దలంతా కలిసి మరోసారి రాజుని పరీక్షించారు. అందరూ పెదవి విరిచారు- "అంబకు బలిచ్చే ప్రాణి అన్ని అవయవాలతో, సంపూర్ణంగా ఉండాలి. ఇట్లాంటిది పనికిరాదు" అని తేల్చేశారు.

ఇంకేం చెయ్యాలి; బందిపోట్ల నాయకుడు రాజుని వదిలిపెట్టేయమన్నాడు. వెంటనే దొంగలు కొందరు రాజుని తీసుకెళ్లి అడవి చివర్లో వదిలేసి వచ్చారు!



రాజుగారిని వాళ్లు వదిలేసిన చోట ఒక ముని కుటీరం ఉంది. రాజుగారు ఆ కుటీరాన్ని చేరుకొని సన్యాసిని చూడబోయారు. చూడగా ఆ సన్యాసి వేరెవరోకాదు, గతంలో తనుబహిష్కరించిన మంత్రే! ఇప్పుడు ఆ

మనిషిని చూసేటప్పటికి రాజుకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లైంది. చాలా సంతోషంతో సన్యాసిని కౌగలించుకొని "మిత్రమా! ఆనాడు నువ్వన్నది నిజమే. యుద్ధంలో నా చిటికెన వ్రేలును పోగొట్టుకోవటం మంచిదే అయ్యింది. లేకపోతే నేను యీనాడు ప్రాణాలతో ఉండేవాడిని కాదు!" అన్నాడు, తన కథను యావత్తూ మంత్రికి వినిపించి, తనను క్షమించమని కోరుతూ.

"దానిదేమున్నది మహారాజా! తమరికేం కాలేదు; అంతేచాలు. భగవంతుడు అంతా మేలే చేస్తాడు, ఆయనకు తెలీకుండా ఏదీ జరగదు" అన్నాడు మంత్రి, నమ్మకంగా.

అంతలోనే రాజుగారు అడిగారు, ఏదో గుర్తొచ్చినట్లు- "కానీ నాకు ఒక సంగతి చెప్పండి- నేను మిమ్మల్ని బహిష్కరించాను గదా, మరి దానివల్ల మీకు ఏమైనా మేలు కలిగిందా?" అని.

"నాకు జరిగిన మేలు స్వయం సిద్ధంగా కనబడుతూనే ఉన్నది, నేను ఇప్పుడు ఇంకా బ్రతికి ఉన్నానంటే అది మీ చలవే!" అన్నాడు మంత్రి.

"అదెలాగ?" అని రాజుగారు అడిగిన మీదట మంత్రిగారు చెప్పారు- "చూడండి, నన్ను మీరు బహిష్కరించి ఉండకపోతే మీతో బాటు నేనూ అడవికి వచ్చి ఉండేవాడిని. దొంగలు నన్నుకూడా పట్టుకొని ఉండేవాళ్లు. మీకంటే చిటికెనవేలు లేదు- కనుక వాళ్లు మిమ్మల్ని వదిలిపెట్టేసే వాళ్లు. కానీ నేను వాళ్ల ఉద్దేశానికి చక్కగా సరిపోయేవాడిని! వాళ్లు నన్ను ఈ పాటికి అంబకు బలిచ్చేసి ఉండేవాళ్లు!" అన్నారు.

రాజుగారు మంత్రిని అభినందించారు. అంత జ్ఞానమూ, నిబ్బరమూ ఉన్న ఆయన్ని రాజ్యానికి వెంటబెట్టుకెళ్లి మంత్రిపదవి తిరిగి ఇవ్వటమేకాక, పలు విధాలుగా సత్కరించారు.

బొమ్మకు కథ రాయండి!

నిర్వహణ: శ్రీమతి జి.లలిత, telugu4kids.com

ఈ క్రింది బొమ్మను చూడండి:



పెను తుఫాను రేగుతుంటే ఈ ముగ్గురూ ఎటుపోతున్నారు, టోపీలు పెట్టుకొని? ఊహించండి. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ పోతే ఒక కథ తడుతుంది మీ మనసుకు. దాన్ని కాగితంమీద పెట్టెయ్యండి. మాకు పంపండి. బాగుంటే రెండు నెలల తర్వాత దాన్ని కొత్తపల్లిలో ప్రచురిస్తాం!

మా చిరునామా: కొత్తపల్లి బృందం, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా -515101
ఫోన్లు: 08559 24022, 7702877670, e-mail: team@kottapalli.in

ఏమైందో ఏమో!

రెండు నెలల క్రితం 'బొమ్మకు కథ రాయండి' అని ఇచ్చిన బొమ్మకు స్పందన ఇది...

రచన: శ్రీమతి జి. లలిత, telugu4kids.com

రామేశం అనే రచయిత తన వ్రాత బల్ల ముందు కూర్చుని ఆలోచిస్తున్నాడు. ఇంకో వారం లోపు అతను నవల పూర్తి చెయ్యవలసి ఉంది. ఇన్నాళ్ళు నుంచి అవ్వనిది ఇంకో వారంలో ఎలా అవుతుందని ఆదుర్దాగా ఉంది. *పబ్లిషరు వచ్చే సరికి కనీసం చిత్తు ప్రతి ఐనా సిద్ధం చేస్తే బావుంటుంది..* కానీ అతనికి ఆ ఆశ కూడా లేదు!

పట్నంలో తను అద్దెకున్న ఇంట్లో తనకి ప్రశాంతంగా ఉండట్లేదని ఊరికి దూరంగా ఇక్కడ ఈ ఇల్లు కొనుక్కున్నాడు రామేశం. ఇక్కడ మైలు దూరం నడిచినా మనిషి జాడ ఉండదు. ఊరికే వచ్చి తలుపు కొట్టి అల్లరి చేసే పిల్లలు కానీ, ఏ మందులో అవసరమైతే గబుక్కున తెచ్చి పెట్టమని అడిగే వయసు మళ్ళిన వారు కానీ, స్నేహం పెంచుకుని సినిమాలకో షికార్లకో కలిసి వెళ్దామనే కుర్రవాళ్ళు కానీ లేరు. *అసలు చుట్టు ప్రక్కల ఎవ్వరూ లేరు. చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దం. అసలు చీమలు కూడా ఉన్నాయో లేవో ఈ ఇంట్లో*!

ఇక ఏ ఇబ్బందీ లేకుండా ఆపకుండా పేజీలకు పేజీలు వ్రాసెయ్యవచ్చు అనుకున్నాడు రామేశం. ఈ ఇంట్లోకి వచ్చిన క్రొత్తల్లో ఉత్సాహంగా వ్రాయడం మొదలు పెట్టాడు. కానీ కొన్నాళ్ళకు అతనికి విసుగు అనిపించసాగింది. ఏ సందడీ లేకుండా ఒక్కడే బిక్కు బిక్కుమంటూ రోజంతా గడపడంతో కథలు వ్రాయడానికి ఆలోచనలు సరిగ్గా వచ్చేవి కావు. సందడి కోసం ఎవరైనా పని వాళ్ళని పెట్టుకుందామన్నా ఊరికి దూరంగా రావడానికి ఎవరూ ఒప్పుకోలేదు.

కొన్ని రోజులుగా వ్రాయడానికి కూర్చున్నప్పుడల్లా ఏవో వింత వింత ఆలోచనలు వచ్చేవి. *ఏవో చప్పుళ్ళు వినిపించేవి.* తీరా చూస్తే ఏమీ ఉండేవి కావు. విసుగొచ్చి ఆ వచ్చిన చప్పుళ్ళన్నీ ఒక పుస్తకంలో వ్రాసుకోసాగాడు. వాటి గురించి ఏవేవో ఊహించి వ్రాసేవాడు. అది అతనికి ఒక వ్యసనం లాగా అలవాటయ్యింది. ఊహించి ఊహించి కథలు అల్లి పుస్తకాన్ని నింపేశాడు కానీ తను మాటిచ్చిన నవల మాత్రం పట్టుమని పది పేజీలు కూడా పూర్తి చెయ్యలేకపోయాడు.

ఆ రోజు ఇంక ఇలా కాదని తను వ్రాయవలసిన నవలకి సంబంధించిన పేపర్లు ముందు పెట్టుకుని కూర్చున్నాడు. ఆ కథ గురించి తప్పితే ఇంకేమీ ఆలోచించకూడదనీ, వ్రాయకూడదనీ నిర్ణయించుకున్నాడు. తనకు వినిపిస్తున్న శబ్దాల గురించి ఊహించి వ్రాసుకున్న కథల పుస్తకాన్ని చెత్త బుట్టలోకి గిరవాటు వేశాడు. బల్ల ముందు కూర్చున్నపది నిమిషాలకే మళ్ళీ ఏదో చప్పుడయ్యింది. రామేశం విసురుగా లేచి నిలబడ్డాడు. "*ఇది చివరి సారి. ఈ ఒక్క సారికి ఇల్లంతా పై నుంచీ కింది దాకా చూసి వస్తాను. లోపలా బయటా చూస్తాను. వచ్చి కూర్చుని ఇక సాయంత్రం వరకూ లేవకుండా కూర్చుని ఈ నవల ఎంతవరకూ ఐతే అంతవరకూ వ్రాస్తాను,*" అని నిర్ణయించుకుని గదినుంచి బయటకి వెళ్ళాడు. అతను వ్రాయడానికి ఏర్పరుచుకున్న గది మిగిలిన ఇంటికన్నా కాస్త క్రిందకు ఉన్నది. తలుపు తీసుకుని ముందు గదిలోకి వచ్చిన తరువాత కుడి చేతి వైపు తిరిగి మెట్లు దిగి లోపలికి వెళ్తే విశాలమైన గది. చుట్టూ పెద్ద కిటికీలు. మెట్లకి వీపు చేసి కూర్చునేలా కుర్చీ. దాని ముందు కిటికీని చూస్తూ బల్ల.

ముందుగా మెట్లెక్కి పైకి వెళ్ళి బయటి తలుపు తీసి చూశాడు. ఎవరూ తలుపు కొట్టలేదు. బెల్లు నొక్కలేదు. బయటకు వెళ్ళి చూశాడు. చుట్టు ప్రక్కల మనుషులే కాదు కుక్కలు, మేకల వంటి జంతువులు కానీ ఆఖరికి పురుగులాంటి ఏ ప్రాణి కానీ కనిపించలేదు. ఇంటి చుట్టూ ఓ సారి తిరిగి లోపలికి వచ్చాడు.

ఇల్లంతా తిరిగి చూశాడు. అనుమానం కలిగించేలా ఏదీ కనిపించలేదు. లాభం లేదని బాత్రూములోకి వెళ్ళి చెవుల్లో పెట్టుకునే దూది తీసుకున్నాడు.

దూదిని చెవుల్లో పెట్టుకుని తన వ్రాత బల్ల దగ్గరికెళ్ళడానికి మెట్లు దిగబోయిన వాడల్లా ఆగిపోయాడు. అక్కడ అతని బల్ల దగ్గర ఎవరో ఉన్నారు! ఉన్నట్లుండి అతని కళ్ళ ముందు అంతా శూన్యమైపోయింది.



కళ్ళు తెరిచేసరికి ఎదురుగుండా తన పబ్లిషరు. కంగారుగా చుట్టూ చూసుకున్నాడు. అతను హాస్పిటల్లో ఉన్నాడు. వళ్ళంతా తడుముకుని చూసుకున్నాడు. వంటికి గాయాలు కానీ కట్లు కానీ ఏమీ లేవు. అయినా కంగారు తగ్గ లేదు. అప్పుడే నర్సు వచ్చి బ్లడ్ ప్రెషర్ చూసింది. ఇంకా ఏవేవో లెక్కలు తీసుకుంది. "మీకేమి కంగారు లేదు. ఏదో అనుకోని సంఘటన జరిగి తాత్కాలికంగా జ్ఞాపక శక్తి కోల్పోయారు. మిమ్మల్ని ఈయనే హాస్పిటల్కి తీసుకు వచ్చారు. వారం రోజులుగా మిమ్మల్ని రోజూ వచ్చి పరామర్శిస్తున్నారు. ఈయనను మీరు గుర్తుపట్టగలరా?" అని అడిగింది నర్సు.

"ఈయన...ఈయన పబ్లిషరు. ఈయనకి నేను పుస్తకం పూర్తిచేసి ఇవ్వాలి. అవునూ, ఈ రోజు తారీఖు ఏంటి?" అని అడిగాడు నర్సును. "*ఏప్రిల్ ఒకటి*" అని చెప్పింది నర్సు.

"క్షమించండి. పుస్తకం పూర్తి కాలేదు. ఈ లోగా ఇది ఒకటి, నేను ఇలా హాస్పిటల్లో తేలాను. ఇంకొక నెల గడువు ఇవ్వండి. నేనా ఇల్లు వదిలేసి నగరం మధ్యలో ఒక గది అద్దెకైనా తీసుకుని అక్కడ ఉండి వ్రాస్తాను. ఈ ఖాళీ ప్రదేశంలో ఉంటూ నా బుర్రలో ఆలోచనలు కూడా ఖాళీ అయిపోయినట్లున్నాయి" అని

అడిగాడు రామేశం. పబ్లిషరు వింతగా నవ్వి పక్కనే బల్ల మీద ఉన్న ఒక పుస్తకాన్ని తీసి చూపించాడు. ఆ పుస్తకం మీద రచయిత పేరు తనదే! పుస్తకం కవరు మీద బొమ్మ చూడగానే మళ్ళీ స్పృహ తప్పినంత పని అయ్యింది రామేశానికి. నర్సూ, పబ్లిషరూ కలిసి సాయం చేసి పైకి కూర్చోబెట్టారు అతనిని.

"*ఇది మీరు వ్రాసిన కథే. మీ చిత్తు కాయితాల బుట్టలోంచి తీసుకున్న కథ,"* *నవ్వుతూ చెప్పాడు పబ్లిషరు.*

రామేశానికి ఆపుకోలేనంత నవ్వు వచ్చింది ఈ సారి. కాసేపయ్యాక తమాయించుకుని, "మీకు చాలా ధన్యవాదాలు." అని చెప్పాడు. పబ్లిషరు మాత్రం, "మేమే చెప్పాలి ధన్యవాదాలు. సరి క్రొత్త ఆలోచన. మీరు ఇంతవరకూ ఇటువంటి కథలు వ్రాయలేదు. ఈ పుస్తకాన్నిమీరు చెత్తబుట్టలో ఎందుకు పడేశారో నాకు అర్థం కాలేదు. ఆ రోజు నేను మిమ్మల్ని కలవడానికి వచ్చి మీ కోసం ఎదురు చూసే సమయంలో చొరవ తీసుకుని మీ వ్రాత బల్ల దగ్గరకు వెళ్ళి ఉండకపోతే అక్కడ పేరుకున్న చిత్తు కాగితాలను చూసే వాడిని కాదు. ఈ కథ నాకు దొరికేది కాదు. అన్నట్టు ఆ రోజు నేను వచ్చేసరికి మీ ఇంటి తలుపు తెరిచే ఉన్నది. అందుకే చొరవగా మీరు లేకున్నా మీ గదిలోకి వెళ్ళి చూశాను. అది సరే కానీ, ఇక మీరు త్వరగా కోలుకోవాలి. రెండు వారాల్లో ఈ పుస్తకం విడుదల పెద్ద ఎత్తున చేస్తున్నాం. ఆ సభకు మీరు రావాలి !" అని చెప్పి వెళ్ళిపోయాడు.

రామేశం త్వరలోనే కోలుకుని పుస్తక ఆవిష్కరణకు వెళ్ళాడు. తిరిగి వచ్చి తను నగరంలో అద్దెకు తీసుకున్న ఇంట్లో బాల్కనీలో కూర్చుని ఆ పుస్తకం తీసి చూసుకున్నాడు. దాని మీద బొమ్మ చూసి అతనికి నవ్వాగలేదు మళ్ళీ. గట్టిగా నవ్వుతుంటే చుట్టు ప్రక్కల ఇళ్ళ వాళ్ళు కిటికీల్లోంచి చూడ సాగారు. అతను సర్దుకుని మళ్ళీ ఆ బొమ్మ చూశాడు. అది తను మెట్ల మీద స్పృహ తప్పిపోయినప్పటి దృశ్యంలానే ఉంది. ఆ రోజు తను వ్రాత బల్ల దగ్గర చూసుకుని దడపడినది తన పబ్లిషరుని చూసేనన్నమాట! మరోసారి చిన్నగా

మనసులోనే నవ్వుకున్నాడు. ఇప్పుడు తన ఇల్లు ఆ పుస్తకం మూలాన ఒక పర్యాటక కేంద్రంగా తయారయ్యింది. ఆ కథ ఆ ఇంట్లో నిజంగానే జరిగినద్ని నమ్మేసేంతగా అక్కడ నాటకీయంగా దృశ్యాలు అమర్చారు. పుస్తకం బాగా పేరు పొందాక, చుట్టూ ఎన్నో దుకాణాలూ ఇతర ఆకర్షణలూ వెలిశాయి. ఇప్పుడక్కడ ఎంతోమంది జనాలు- పగలూ రాత్రీ కూడా.

ఆ పుస్తకం మీద తనకు వచ్చిన ఆదాయంతో రామేశం ఇంకో కొత్త ఇల్లు కొనుక్కోబోతున్నాడు. ఆ ఇంటి చుట్టూనే కాదు, ఆ ఇంట్లో కూడా ఎప్పుడూ సందడిగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని అతని ఆలోచన. "ముందు గదిలో ఒక చిన్న గ్రంథాలయం ఏర్పాటు చేసుకుంటాను. చుట్టు ప్రక్కల పిల్లలు ఎప్పుడైనా అక్కడికి వచ్చి తమకి నచ్చిన పుస్తకాలు తీసుకుని చదువుకోవచ్చు. ఒక కుక్క పిల్లను పెంచుకోవడానికి తీసుకుంటాను..." ఇలా సాగుతున్నయి అతని ఆలోచనలు. ఆగకుండా సాగుతున్నాయి అతని కలం నుంచి కథలు!

ఈ హడావిడిలో అతని కలవరపాటుకూ, కథలకూ కారణమైన శబ్దం మరుగున పడిపోయింది. కొన్నాళ్ళకు ఆ శబ్దం ఆగిపోయింది. *అది బ్యాటరీతో నడిచే బొమ్మ గడియారం.* ఎలా వచ్చిందో రామేశం వ్రాత బల్ల ఉన్న గది కిటికీ ఒక దాని చూరు మీద చేరింది. ఆ ఏకాకి రచయిత ఒంటరి తనాన్ని దూరం చెయ్యడానికా అన్నట్టు ఏ కాకో, ఎక్కడ్నుంచో తెచ్చి అక్కడ పడేసింది దాన్ని!

ఎమర్ జోన్స్

యువకెరటాలు-4

నిర్వహణ: సౌమ్య, పుస్తకం డాట్ నెట్.



ఐర్లాండ్ దేశపు రాజధాని డబ్లిన్ నగరంలో ఏటా "యంగ్ సైంటిస్ట్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్" అని ఒకటి జరుగుతుంది. స్కూలు పిల్లల్లో సైన్సు గురించి ఆసక్తి కలిగించడం ఈ కార్యక్రమం లక్ష్యం. మనకు జిల్లాస్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను, దేశ స్థాయిలోనూ 'సైన్స్ ఎగ్జిబిషన్లు'జరుగుతాయి కదా, ఈ డబ్లిన్ నగరపు ఎగ్జిబిషన్ కూడా అలాంటిదే- మరికాస్త పేరు గాంచిందన్నమాట.

అక్కడ ఏటేటా ఇచ్చే 'యంగ్ సైంటిస్ట్' అన్న అవార్డు 2008 సంవత్సరంలో ఎమర్ జోన్స్ అనే అమ్మాయికి దక్కింది. 'ప్రతి ఏడాదీ ఎవరికో ఒకరికి రావల్సిందే కదా!' అనుకోవచ్చు- కానీ, ఇక్కడ ప్రత్యేకత ఏమిటి అంటే, ఈ అవార్డు వచ్చేనాటికి జోన్స్ వయసు పదమూడు సంవత్సరాలే! వాళ్ల దేశంలో ఈ అవార్డు పొందిన అతి పిన్నవయస్కురాలు ఆమే!!

ఇంతకీ ఈ అమ్మాయి ఏం చేసిందో తెలుసా?? మీరంతా ఇసక సంచీలు చూసే ఉంటారు కదా ఎప్పుడో ఒకప్పుడు? పేరుకు తగ్గట్లే సాధారణంగా ఆ సంచీల నిండా ఇసక నిండి ఉంటుంది. జల ప్రవాహం ఆపడానికో, మిలటరీ వాళ్ళు యుద్ధాలు చేస్తున్నప్పుడు వెనుక దాక్కోవడానికో వాడుతూ ఉంటారు వీటిని. ఇంకా చాలా చోట్ల కూడా ఉపయోగిస్తూ ఉంటారు. బహుశా చాలా సినిమాల్లో కూడా చూసే ఉంటారు మీరు. నా మట్టుకు నాకు ఇసక సంచీలు తొలిసారి చూసిన గుర్తు - మా ఊర్లో తుంగభద్రా నదిలో! ఇంతకీ ఇదంతా ఎందుకు చెప్తున్నాను అంటే - 'ఒక్కొక్కసారి

ఇసకసంచీలు అత్యవసర పరిస్థితుల్లో భద్రత కోసం కూడా వాడతారు అని అన్నా కదా. అవి నిజంగా భద్రమైనవేనా?' అని ఈ అమ్మాయి పరిశోధించింది. 'అలాగే, వాటిని మరింత భద్రత కలిగించేవిగా చేయడం ఎలా?' అన్నప్రశ్నకు తన పరిశోధన ద్వారా పరిష్కారం కనుక్కుంది.

మామూలుగా ఈ ఇసకసంచీలను భద్రత కోసం ప్రహరీలాగా పెడుతున్నప్పుడు వాటిమధ్య నిలకడ కోసం ముళ్ళ కంచెల్ని ఉంచి వాడతారు. దాని బదులు వెదురు గానీ, చెక్క గానీ వాడితే, అదే స్థాయి భద్రతను- మరింత తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో సాధించవచ్చని ఎమర్ పరిశోధించి నిరూపించింది! ఎంత చిన్న సంగతి-అయితే ఎంత ప్రధానమైన సంగతి! ఇందుకే ఆమెకి ఈ "యంగ్ సైంటిస్ట్" అవార్డు వచ్చింది. 'నీకు ఇంత చక్కని ఐడియా ఎలా వచ్చిందమ్మా?' అని అడిగితే 'ప్రకృతి భీభత్సాల గురించి, అత్యవసర సమయాల్లో భద్రత గురించీ చదివిన వార్తలే తనకి ప్రేరణ' అని చెప్పింది ఈ అమ్మాయి. ఈ ప్రదర్శన తరువాత ఆమె స్కూల్లోనూ, తరువాత ఆమె నివసించే పట్టణంలోనూ ఆమెకి ఒక సన్మానంకూడా చేసారట. ఇటీవలే స్కూలు చదువులు ముగించుకున్న ఈ అమ్మాయి పరీక్షల్లో చక్కటి ప్రతిభ ప్రదర్శించి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం లో చదువుకోవడానికి సీటు దక్కించుకుంది.

అదీ ఈ అమ్మాయి కథ (ఇప్పటివరకూ). ఇలా మన ఆలోచనలకి పదును పెట్టుకుంటూ, మీ స్కూల్లోనూ, మీ జిల్లాలోనూ జరిగే సైన్సు ఎగ్జిబిషన్లలో ఉత్సాహంగా పాల్గొనడం వల్ల మీరు కూడా ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. ఏమంటారు?

సమీక్ష

నిర్వహణ: శ్రీమతి మాలతీ కృష్ణ, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.



డిసెంబరు నెల సంపాదకీయం బాగా నిరుత్సాహపరచింది. ముగింపు వాక్యాలకీ, కథాంశానికీ సంబంధ లోపం వున్నట్లు అనిపించింది. దేవుడే మనుష్యుల రాతను మార్చడం తనవల్ల కాదనేశాక, జరిగిన దాంట్లో పాపం రాము ప్రమేయం ఏమున్నట్లు? కొత్త సంవత్సరం సందర్భంగా సుఖ దు:ఖాల గురించి మాట్లాడడం పరిపాటే అయినా గానీ, పిల్లల పత్రిక కదా, ఉత్సాహ పరచే విషయం తీసుకుంటే బాగుండే దేమో! క్రిస్మస్, న్యూఇయర్- రెండూ పిల్లల్ని సంతోషపెట్టేవి కదా!

అట్ట మీద బొమ్మ ప్రతిసారీ, ఆ మాసపు విశిష్టతని సుస్పష్టంగా గుర్తు చేస్తూ, ఓ స్ఫూర్తిని నింపేదిగా వుండడం అలవాటైపోయింది. అలానే వుండాలని లేదుగానీ, ఆ అలవాటులో ఈసారి పిల్లలకెంతో ఇష్టమైన క్రిస్మస్ తాతనో, జీసస్ స్ఫూర్తినో ఊహించి, ఎదురుచూసిన మాకు- కొంచెం 'అయ్యో!' అనిపించింది.

నీతిచంద్రిక కూడా ఈసారి పట్టు తగ్గింది. సంభాషణలు సాగదీసినట్లు, అక్కడక్కడా సందర్భానికి సంబంధం లేనట్లుగానూ వున్నాయనిపించింది. 'మాటల వల్ల విరిగిన మనసు మాత్రం ఇక చక్కబడదు', 'మాట తీరు బాగుండడం అవసరం' లాంటివి ఆయా సందర్భాలలో ఆయా పాత్రలకు ఎందుకు ఆపాదించారో అర్థం కాలేదు.

అతి సాధారణమైన అంశాలను కథా వస్తువులుగా ఎంచుకుని, కథ వ్రాయడానికి బుర్రలు బద్దలు కొట్టుకోవలసిన పన్లేదని చెప్పి మెప్పించారు సుష్మ, శ్రీలత - పెద్దల మాట, కంచె కథల ద్వారా. కొడుకు లేని రాజులు యువరాణికి స్వయంవరం ప్రకటించి, యోగ్యుడైన అల్లుణ్ణి

ఎంచుకోవడమే మనకి తెలుసు. భార్గవి యువరాణి చేతికే పగ్గాలప్పగించి మంచి ముగింపునిచ్చింది- 'స్త్రీశక్తి' కథకి.

ధనుశ్రీ వ్రాసిన 'వారసుడు ' కథ మామూలుగానే వున్నా, భీముడు కష్టపడి పని చేస్తూ, నలుగురికి పని కల్పిస్తూ, ఆ తృప్తిలో తండ్రి వద్దకు వెళ్ళడాన్నీ, పదవినీ మర్చిపోవడం బాగుంది. మనం చేసే పని ద్వారా వచ్చే సంతృప్తి ముందు పదవి ఏ పాటీ చెయ్యదని చెప్పకనే చెప్పడం అంత చిన్నపిల్లకు సాధ్యమైందంటే ఆశ్చర్యం.

హైమావతి గారి చంటిగాడి కథ పరిసరాల విజ్ఞానం గురించిన మంచి పాఠంలా వుంది. అతి సరళమైన వస్తువుతో, చురుకుగా సాగిన కథనం ఆద్యంతం ఆపకుండా చదివించింది. తాను నమ్మిన విషయాన్ని ఎంతో ఇష్టంగా చెప్పినట్లుంది. 'రాక్షసుడే నయం' ప్లాట్ క్రొత్తగా వుంది. 'తెలివి-బలం'లో చాలా ప్రశ్నలొచ్చాయి. అంతమంచి స్నేహితులు - పిల్లలపెళ్ళి గురించి, ముందు ఇద్దరూ కలసి ఎందుకు మాట్లాడుకోలేదో, చలమయ్య మోసం తెలిసిన రామయ్య, స్నేహితుడి దగ్గరకే తిన్నగా వెళ్ళక గ్రామాధికారి దగ్గరికి ఎందుకు వెళ్ళాడో, అర్థం కాలేదు.

ఇక పంజరంలో పెరిగిన చిలుక బలహీనతని గ్రహించిన పులి దాన్ని వదిలేయడం, కృత్రిమ వాతావరణానికి అనుగుణంగా నేర్చుకున్న విషయాలేవీ నిజజీవితంలో పనికి రావని చెప్పడం బాగుంది. 'శబరి కథ' అగర్వాల్ గారు చెప్పినదే ఇంత వరకూ విన్నది. మరి అసలు రామాయణంలో ఎలా వుందో? అనువాదం శబరి భక్తినీ, రాముడి ప్రీతినీ కళ్ళకు కట్టించింది.

మేథమేట్రిక్స్ చిన్ననాటి జ్ఞాపకాలను కదిలించింది. జైసీతారాం గారి చిట్టి పాటలు ముద్దుగా వున్నాయి. బొమ్మల విషయంలో కాస్త శ్రద్ధ చూపిస్తే బాగుండేదనిపించింది.

సరిక్రొత్త సంవత్సరానికి సంతోషంగా స్వాగతం చెబ్దాం. సంవత్సరమంతా అలరించిన కొత్తపల్లికి అభినందనలు. క్రొత్త సంవత్సరంలో - కొత్తపల్లి కావాలి మరిన్ని క్రొత్త కలాలకీ - కొంగ్రొత్త కథలకీ సరికొత్త వేదిక!

పదరంగం-11

ఈ పదరంగం చాలా సులభం! దీన్ని ఓ తెల్లకాగితంలో పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-12 తో పాటు ప్రచురించగలం. నిర్వహణ: దేవి, బెంగుళూరు.

1				2	3
			4		
5	6	7			
	8			9	
10		11			
12					

ఆధారాలు:

అడ్డం:

1. జనవరిలో వచ్చే ఒక పండుగ(3)
2. బాబు కాదు (2)
4. నలక లాంటి దే, కంటిలో పడితే బాధిస్తుంది(3)
5. రంగుల ముగ్గు(4)
8. దగ్గర(2)
11. తాతకు ఊతం(4)
12. విచారం(3)


నిలువు:

1. సంతోషం, ఆనందం లాంటిదే (3)
2. క్షీరం (2)
3. కుంకుమ తోటిది, ఒక రంగు(3)
4. మంచంలో నక్కి, రక్తం తాగే పురుగు(2)
6. భీముడు,ఆంజనేయుడు-వీరిద్దరి ఆయుధం (2)
7. వడ్లు పండే చేలు(4)
9. బట్టలు ఉతికేవాడు(3)
10. ఈ ఆధారం సంఖ్య(2)

పదరంగం-10 కి సమాధానం

సరైన సమాధానం రాసి పంపిన పిల్లలు:

1. అసంగానందరెడ్డి, 4 వ తరగతి, అజంతా స్కూలు, నెల్లూరు.
2. ఏ.యస్. నందన, 4 వ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.
3. జి.సత్యలక్ష్మి, రెండో తరగతి, ఇంటిబడి, చెన్నేకొత్తపల్లి.
4. ఆర్. అయ్యప్ప, 6 మేరిగోల్డ్, అరవింద స్కూల్, కుంచనపల్లి.



1 కొం	డ	2 చి	లు	3 వ	
గ		గు		4 న	ల
	5 బా	రు	6 గు	రు	
7 త	న		డి		8 అ
9 వి	వా	హం		10 న	క్ష
11 క	ప్పు		12 మీ	గ	డ

సంక్రాంతి సంబరం

రచన, సంగీతం: శ్రీ వారణాసి వెంకట్రావు గారు, విజయవాడ
గానం: శ్రీయుతులు సుధారాణి, మురళీకృష్ణ, అనంత శర్మ.

ఎన్నెన్నో పండగలొస్తై
ఎగసిపడే ఉత్సాహంతో
ఎనలేని ఆనందం
ఏడంతా పిల్లలకిస్తై

సంబరాల సంక్రాంతొచ్చె-
ఊరువాడకుల్లాసమిచ్చె
సేద్యం చేసే రైతన్నల
సేదతీర్చే మూన్నాళ్ల పండగ

చేసిన శ్రమ ఫలితంగా
సిరి చేరు ధాన్యమై రైతులిళ్ళ
తీరిచి దిద్దిన ముగ్గుల్లు
తీరుగ కన్నెలు పెట్టిన గొబ్బిళ్ళు
కురిసే మంచు తొలి పొద్దుల్లో
హరిని కీర్తిస్తూ తిరుగు దాసుళ్ళు
ముగురున బట్టలు ముంగాళ్ల గజ్జెలు
ముంగిట చిందేయు బసవళ్ళు ఎటుకన్నా
సంక్రాంతి సమయాన!

జయమమ్మ జయమమ్మ జయము

రచన: శ్రీ వారణాసి వెంకట్రావుగారు, విజయవాడ.
గానం: చిరంజీవులు సరిగమ, కీర్తన, అఖిల, విజయవాడ.



జయమమ్మ జయమమ్మ జయము
జయమమ్మ జయమమ్మ జననీ
భువనైక పావనీ ఓ భారతావనీ!

ఉభయ సంధ్యలు కవితలుగ్గుపాలుగ బెట్టి
కాళిదాసుని కన్న ఓ పాలవెల్లీ
రాగ తాళపు శ్రుతుల పొత్తిళ్లలో పొదవి
త్యాగయ్య సాకిన ఓ కల్పవల్లీ!

హిమశైల శిఖరాలు కురుల మణులై కుదుర
గంగా తరంగాలు -
బంగారుటంచులై కొంగునమరె
గౌతమీ కృష్ణలు ఒడిపాపలై నీకు ఒదిగిపోగా
మూడు జలధులె నీకు మోకరిల్లెను తల్లీ!

ముద్రిత ప్రతుల వెల:

ప్రతి ఒక్కింటికి: 20 రూ.

12 పుస్తకాలకైచందా: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust",
A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670

ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు

సంపాదకత్వం: నారాయణ

వెబ్సైటు, సమాచార సాంకేతికత: ఆనంద్, లక్ష్మి

అక్షర కూర్పు: శ్రీలక్ష్మి

ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు

ముఖచిత్రం 'మేరియా మాంటిసోరీ': వీరాంజి

చిత్రాలు: అడవిరాముడు, రాము, వినయ్, వాసు, చంద్రకాంత్, శివ, ప్రసాద్, వెంకట్.

బొమ్మకు కథ: జి.లలిత, telugu4kids

కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు:

ప్రకృతి బడికి, మన లైబ్రరీ వారికి, telugu4kidsవారికి, చిలిపి ప్రశ్నల మూర్తిగారికి, మాలతీకృష్ణగార్లకి, రాధా రాజశేఖర్ గార్లకి, కంప్యూటర్లలో లైనక్సు వ్యవస్థను చక్కగా అందిస్తున్న ఉబుంటు వారికి, జింప్, అడాసిటీ తదితర ఓపెన్ సోర్సు సాఫ్టువేరు నిర్మాతలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలు పెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

మంచి పుస్తకం:

పగటికల

"నేను క్లాసులోకి వచ్చాను. పిల్లలతో చెప్పాను- "అబ్బాయిలూ! ఈ రోజు ఇంతకన్నా ఎక్కువగా చేసే పనేమీ లేదు. రేపటి నుంచీ ఒక కొత్త కార్యక్రమం మొదలు పెడదాం. ఈ రోజుకు సెలవు తీసుకోండి"


సెలవు మాట వినగానే పిల్లలు 'హో-హో' అని కేకలు వేస్తూ క్లాసులోంచి బయటికి వచ్చేశారు. పాఠశాలంతా గందరగోళంతో నిండిపోయింది. వాతావరణం అంతా 'సెలవు, సెలవు, సెలవు' అంటూ ప్రతిధ్వనించింది. నాలుగవ తరగతి పిల్లలు ఎగురుతూ, దుముకుతూ, గంతులు వేసుకుంటూ ఇంటిదారి పట్టారు.

ప్రక్కనున్న విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, 'ఇదేమిటా' అని వింతగా చూస్తూ ఉండిపోయారు. ప్రధానోపాధ్యాయుడు గబగబా నా దగ్గరకు వచ్చాడు. నొసలు విరిచాడు. "మీరు వాళ్ళకు సెలవు ఎందుకిచ్చారు? ఇంకా రెండుగంటలు పాఠశాల జరగాలి కదా?" అన్నాడు.

నేనన్నాను- "అయ్యా! పిల్లలు ఈరోజు ఆసక్తి చూపటం లేదు. అందరూ అస్తవ్యస్తంగా ఉన్నారు.."

ప్రధానోపాధ్యాయుడు కొంచెం కటువుగా అన్నాడు- "వాళ్ళు ఎట్లా వున్నా సరే, నన్ను అడగకుండా మీరు ఈ విధంగా సెలవు ఇవ్వటానికి వీలులేదు. ఒక క్లాసు పిల్లలు ఇళ్ళకు వెళ్ళిపోతే మిగిలిన క్లాసుల వాళ్ళు ఎలా చదువుతారు? మీరు చేస్తున్న ఈ ప్రయోగాలు ఇక్కడ పనికిరావు..."

నేనన్నాను- "..దెబ్బలు కొట్టి చదివించే పని అందరూ చేస్తూనే ఉన్నారు. దాని ఫలితమే ఇవాళ్ల చూస్తున్నాను. పిల్లలు అమర్యాదగానూ, మొరటుగానూ ప్రవర్తిస్తున్నారు. అల్లరి పిల్లలైపోయారు. హద్దుమీరి పోయారు; కొరకరాని కొయ్యలుగ తయారయ్యారు. 'హే-హే,హూ-హూ' అని కేకలు వేయటం, చప్పట్లు కొట్టటమే నేర్చుకున్నట్లుగా కనిపిస్తున్నారు. వాళ్లకు బడిమీద ప్రేమ లేదు. సెలవు పేరు వినగానే ఎగురుతూ, దుముకుతూ పరుగు పెట్టారో చూడండి.." "



మీరు చెప్పండి ఇప్పుడు- మీకు బడి అంటే ఇష్టమా, సెలవులంటే ఇష్టమా?

చదవటం అంటే ఇష్టమా, చదివాక వచ్చే సర్టిఫికేట్లు, ఉద్యోగాలూ ఇష్టమా?

చదువుకునేవాళ్ళు, చదివించేవాళ్ళు కొంచెం ఊహ రాగానే తప్పకుండా చదవాల్సిన- కథకాని కథలాంటి పుస్తకం, **పగటికల**. హైదరాబాదు బుక్‌ట్రస్టువాళ్ళు 1999 లో అచ్చేసిన ఈ పుస్తకాన్ని ఎలాగైనా సంపాదించుకొని చదవండి, బాగా ఆలోచించండి.

అయ్యో! తెలుగు రాదే, ఎలాగ?!

"కథలమ్మో కథలు! కథలమ్మో కథలు! రకరకాల కథలు! తెలుగుపిల్లల కథలు!"

"ఏం కథలు బాబూ? మా పిల్లలకు తెలుగు చదవటం రాదు. ఇంగ్లీషు కథలు ఏమన్నా ఉన్నాయా, నీ దగ్గర?"

"ఇంగ్లీషువైతే వేరేవాళ్ళ దగ్గర దొరుకుతాయండి. నా దగ్గర ఉన్న సరుకంతా తెలుగువాళ్ల కోసమే. ఏం, మీ పిల్లలు తెలుగువాళ్ళు కారాండీ? పాపం, వాళ్ళకి కొంచెం తెలుగు నేర్పించకపోయారూ?"

"ఏమో నాయనా! మా వాళ్లకైతే ఇంగ్లీషు అంటేనే ఇష్టం. ఆ ఇంగ్లీషు నేర్చుకునేసరికే వాళ్ల తల ప్రాణం తోకకొచ్చింది. ఇంక తెలుగు ఎక్కడ నేర్చుకుంటారు?"

"అవున్లెండి, పాపం. కానీ నా దగ్గర ఉన్నవి తెలుగు కథలేనండి. మీకు పనికిరావు."

"ఏదీ, ఓసారి చూడనియ్యి- పుస్తకం బానే ఉన్నట్టుందయ్యా, కాయితం, రంగులు అదీనీ- దీన్ని పాపం ఇంగ్లీషులో అచ్చెయ్యకపోయారూ? మీకూ కొంచెం అమ్మకాలుండేవి గద! ఇప్పుడు పిల్లలంతా ఇంగ్లీషు బళ్లలో చదివీ చదివీ, తెలుగుని పూర్తిగా మరచే పోతున్నారుగా?"

"అవునండీ, అందుకనే వీటిని తెలుగులో మాత్రమే అచ్చేస్తున్నాం. మీ పిల్లలకి ఈ కథలు కావాలంటే వాళ్ళు తెలుగు నేర్చుకోవాల్సిందే, తప్పదు. లేకపోతే ఇంకో మార్గం ఉంది- మీరు వాళ్లకి చదివి పెట్టచ్చు-"

"అవున్లే, అట్లాగైనా వాళ్లకి మెల్లగా తెలుగు చదవటం వస్తుందేమో, చూస్తాను. కథలు చదవటం కోసమన్నా వాళ్ళు తెలుగు నేర్చుకుంటారేమో"

"తప్పకుండా నేర్చుకుంటారు చూడండి. అదేమంత బ్రహ్మవిద్య? తలచుకుంటే వాళ్ళు ఒక్కరోజులో నేర్చుకోగలరు. కథల్లో మాయ మీకు తెలీనిదా? మీరు చిన్నప్పుడు ఎన్ని కథల పుస్తకాలు చదవలేదు?"

"అవును నాయనా! ఇప్పుడు తెలుగు పుస్తకాలే కరువైపోతున్నాయి"

"ఏమీ లేదండీ! ఆదరించేవాళ్లు ఉంటే భాష చటుక్కున పుంజుకుంటుంది. ఏం చేసినా తెలుగులో అర్థమైనంత బాగా పరాయి భాషలో ఎంతమందికి అర్థమౌతుంది, చెప్పండి? ఏదో ఒక మాయ చెయ్యాల్సిందేనండీ. మీ పిల్లలకి 'తెలుగు రాదు' అని ఊరుకోకండి. ఏదో ఒకటి చేసి వాళ్ళ భాషని వాళ్ళకి ఇవ్వాలి- లేకపోతే కుదరదు."

"అంతేనంటావా?"

"అంతేనండీ- వేరే మార్గం లేదు. మాతృభాష తర్వాతే, వేరే ఏదైనా."

Edited, typeset and Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in .